




తెలుగు వార్త వార పత్రిక

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి NSV/14/2023-25

RNI : APTEL/2006/16523





సత్తెనపల్లి న్యూస్ విలేకరులు
గౌరవ సలహదారులు
మారూరి పుల్లారెడ్డి
సబ్ ఎడిటర్స్
షేక్ మహబూబ్ సుభాని
బిరో మహమ్మద్ నాజ్నీన్
ఇట్లు
మీ : ఎడిటర్

సంపుటి : 21 | సంచిక : 31 | 3.8.2026 నుంచి 9.8.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | amf24x7news@gmail.com | ఎడిటర్ : షేక్ అబ్దుల్ గౌస్ అలీ


# డీఎస్సీ వివాదం.. వైసీపీ తడబాటు!



- రాజకీయం వేరు... న్యాయపోరాటం వేరు..
- వైసీపీకి హైకోర్టులో తొలి ఎదురుదెబ్బ..?
- కోర్టులో తేలని ఆరోపణలు..



**అమరావతి:** రాజకీయ ఆరోపణలు చేయడం ఒక ఎత్తయితే... అదే ఆరోపణలను న్యాయస్థానం ముందు నిలబెట్టడం మరో ఎత్తు. రాజకీయ వేదికపై విమర్శలు, నిరసనలు, ఆందోళనలు ప్రభావం చూపవచ్చు. కానీ కోర్టులో మాత్రం ఆధారాలు, బాధితులు, చట్టపరమైన బలం కీలకం. ఆ కసరత్తు లేకుండా న్యాయపోరాటం మొదలుపెడితే ఎదురుదెబ్బలు తప్పవని మెగా డీఎస్సీ-2025 అంశంలో తాజా పరిణామాలు చెబుతున్నాయి. మెగా డీఎస్సీ-2025లో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, సీబీఐ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టులో ఆసక్తి కర పరిణామాలు చోటుచేసుకున్నాయి. విచారణ సందర్భంగా న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయంగానూ చర్చ నీయాంశంగా మారాయి.

## రాజకీయ వాదనలతో సరి..

మెగా డీఎస్సీ అక్రమాల అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ గత కొంతకాలంగా ప్రధాన అజెండాగా తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, దీక్షలు, ఆందోళనలు నిర్వహించింది. నిరుద్యోగ ఉపాధ్యాయులు, డీఎస్సీ అభ్యర్థులు తమతో ఉన్నారని చెబుతూ ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై తీవ్ర విమర్శలు చేసింది. సీబీఐ విచారణతో పాటు మంత్రి రాజీనామా చేయాలని కూడా డిమాండ్ చేసింది. అయితే ఇదే అంశాన్ని కోర్టు ముందుకు తీసుకెళ్లే సమయంలో మాత్రం రాజకీయ వాదనలకు సరిపడే స్థాయిలో చట్టపరమైన బలం చూపించలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా క్రీడల కోటా రిజర్వేషన్ పెంపు వల్ల నష్టపోయామని ఒక్క అభ్యర్థి కూడా కోర్టును ఆశ్రయించకపోవడం న్యాయస్థానం దృష్టిని ఆకర్షించింది.

## బాధితులు ఏరీ?

"నిజంగా నష్టం జరిగి ఉంటే బాధితులే కోర్టును ఆశ్రయించి ఉండేవారు కదా?" అని హైకోర్టు ప్రశ్నించడం గమనార్హం. అభ్యర్థులు భయపడి కేసులు వేయలేదన్న పిటిషనర్ వాదనను కూడా న్యాయస్థానం అంగీకరించలేదు. "భయపడే వారే అయితే ఇతర అంశాలపై 335 రిట్ పిటిషన్లు ఎలా దాఖలయ్యాయి?" అని ప్రశ్నించింది. అంతేకాదు, ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించరాదని కూడా స్పష్టం చేసింది.

ఇక్కడే వైఎస్సార్ కాంగ్రెస్ వైఖరిపై మరో ప్రశ్న తలెత్తుతోంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసనల్లో డీఎస్సీ బాధితులు, నిరుద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారని పార్టీ ప్రకటించింది. మరి అలాంటి బాధితులను పిల్‌లో ఎందుకు భాగస్వాములను చేయలేకపోయింది? రోడ్డుపైకి తీసుకొచ్చిన బాధితులను కోర్టు ముందుకు తీసుకురావడంలో పార్టీ విఫలమైందా? అనే సందేహం సహజంగానే వ్యక్తమవుతోంది. అయితే ఈ వ్యవహారం ఇక్కడితో ముగిసిపోలేదు. పిటిషన్‌ను వెంటనే కొట్టివేయకుండా, "ఉపసంహరించుకుంటారా? లేక పిటిషనర్‌తో మాట్లాడి వాదనలు కొనసాగిస్తారా?" అని న్యాయమూర్తులు ప్రశ్నించడం గమనించాల్సిన అంశం. అంటే వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఇంకా ఒక అవకాశం మిగిలి ఉన్నట్టే. వాయిదాలోగా నిజంగా నష్టపోయిన అభ్యర్థులను కేసులో భాగస్వాములను చేసి, తమ ఆరోపణలకు తగిన ఆధారా లను సమర్పించ గలిగితే వైఎస్సార్ కాంగ్రెస్ వాదనలకు మరింత బలం చేకూరే అవకాశం ఉంది. లేకపోతే రాజకీయంగా చేస్తున్న ఆరోప ణలు, న్యాయస్థానం ముందు నిలబడలేక పోయాయనే విమర్శలకు మరింత ఊతమిచ్చినట్లవుతుంది.


"సత్తెనపల్లి న్యూస్" వార్త వారపత్రిక పాఠకులకు

## ముఖ్య విజ్ఞప్తి!

చాలా కాలం నుంచి నాచే నిర్వహింపబడుతున్న మన "సత్తెనపల్లి న్యూస్" వార్త వార పత్రికను ఆదరిస్తూ, పత్రిక కు ఒక గుర్తింపు, గౌరవం రావటానికి నాకు సహరించిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

కొంతకాలం నుండి నా వయసు రీత్యా కలిగిన అనారోగ్యంవల్ల పత్రికను నేను స్వయంగా నడపటానికి వీలుపడటం లేదు. అందుచేత ఈ పత్రిక నిర్వహణ పూర్తి బాధ్యతలను సీనియర్ జర్నలిస్ట్ " షేక్ అబ్దుల్ గౌస్ ఆలీ " కి 2026 ఆగష్టు 3వ తేదీ నుండి అధికారికంగా అప్పగించినాను. ఇక నుండి ఈ పత్రిక తో నాకు ఎలాంటి అధికారిక సంబంధం లేదు.

సత్తెనపల్లి న్యూస్ (SN) పేరుతో ఉన్న యు ట్యూబ్ ఛానల్ కు, పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. ఆ యూ ట్యూబ్ ఛానల్ నాకు మాత్రమే స్వంతం. సత్తెనపల్లి న్యూస్ పత్రిక కు మాత్రమే చెందిన అన్ని హక్కులు, బాధ్యతలు ఆలీకి చెందుతాయి.

ఇప్పటి వరకు పత్రిక ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పత్రిక నిర్వహణకు సహకరించిన అందరికి నా అభిమాన పూర్వక కృతజ్ఞతలు ప్రత్యేకంగా తెలియజేసుకుంటున్నాను.

ఇట్లు

**మారూరి పుల్లారెడ్డి,**

సత్తెనపల్లి న్యూస్ యూ ట్యూబ్ ఛానల్ నిర్వాహకులు, సత్తెనపల్లి.



## పాఠకులకు మనవి!

నా పేరు షేక్ అబ్దుల్ గౌస్ ఆలీ. నేను ఒక సీనియర్ జర్నలిస్టుని. ఇంతకాలం మీరు ఆదరించిన "సత్తెనపల్లి న్యూస్ అనే వార్తా వార పత్రిక" నిర్వహణ బాధ్యతను 2026 ఆగస్టు మూడవ తేదీ నుంచి శ్రీ మారూరి పుల్లారెడ్డి గారు నాకు అప్పగించారు. పత్రికా నిర్వహణకు గతంలో మీరు శ్రీ పుల్లారెడ్డి గారికి అందించిన విధంగానే సహాయ సహకారాలను నాకు కూడా అందించి పత్రిక నిర్వహణకు తోడ్పడవలసిందిగా మిమ్ములను ప్రార్థిస్తున్నాను.

ఇట్లు
షేక్ అబ్దుల్ గౌస్ ఆలీ, ఎడిటర్
సత్తెనపల్లి న్యూస్
వార్తా వారపత్రిక,
సత్తెనపల్లి.
Mobile: 95811 46699


# విజయవాడలో తీవ్ర ఉద్రిక్తత

**విజయవాడ:** విజయవాడలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మెగా డీఎస్సీ పరీక్షలో అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ ముత్యాలపాడు వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా దౌర్జన్యానికి దిగారు. అనంతరం, పోలీసులు.. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

దీక్షా శిబిరం ధ్వంసం : విజయవాడలో టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా, ఆయన అనుచరులు దౌర్జన్యంగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ నేతల దీక్షా శిబిరాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడికి దిగారు. దీక్షా శిబిరంపైకి ఎక్కి.. టీడీపీ కార్యకర్త ఒకరు టాయిలెట్ చేశారు. అంతటితో ఆగకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు గుడ్లు విసిరారు. దీంతో, టీడీపీ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. పోలీసులు అక్కడ ఉన్న సమయంలోనే ఇదంతా జరగడం గమనార్హం. టీడీపీ నేతల దాడి కారణంగా ఓ మహిళా వైఎస్సార్‌సీపీ కార్యకర్త స్పృహ తప్పిపోయి



కిందపడిపోయినట్టు సమాచారం. అనంతరం, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. "టీడీపీ ఎమ్మెల్యే గూండాయింజ చేశారు. ఇలాంటి ఎమ్మెల్యే ఉండటం మన దురదృష్టం. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. పోలీసుల సమక్షంలో టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా దౌర్జన్యం చేశారు" అని అన్నారు. దీక్షా శిబిరంలో ఉన్న మహిళలపై కూడా దాడులు చేయడం గమనార్హం. ఈ ఘర్షణల తర్వాత.. వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.

# మరో సారి కేబినెట్ భేటీకి పవన్ గైర్హాజరు




**సత్తెనపల్లి న్యూస్ :** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీరుపై మరోసారి రాజకీయ దుమారం రేగుతోంది. చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశానికి పవన్ కళ్యాణ్ మరోసారి గైర్హాజరయ్యారు. పవన్ కళ్యాణ్ కేబినెట్ సమావేశానికి హాజరుకాకపోవడం ఇది వరుసగా మూడోసారి. గతంలో జరిగిన రెండు మంత్రివర్గ సమావేశాలకు కూడా ఆయన రాలేదు. గతంలో రెండు సార్లు కేబినెట్ సమావేశాలు జరుగుతుండగానే పవన్ కళ్యాణ్ మధ్యలోనే వెళ్ళిపోయిన సందర్భాలు ఉన్నాయి. అప్పటి నుంచి చంద్రబాబు నిర్వహించే ప్రభుత్వ సమీక్షలు, కేబినెట్ సమావేశాలకు పవన్ కళ్యాణ్ కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఇటీవల ప్రధాని మోదీ పర్యటనలో పాల్గొన్న పవన్ కల్యాణ్.. సీఎం చంద్ర బాబు సమీక్షలు, కేబినెట్ సమావేశాలకు ఆయన వరుసగా గైర్హా జరవుతుండటం కూటమి సర్కార్‌లో అసలేం జరుగుతోంది?. అంత ర్గత విభేదాలు ఏమైనా ఉన్నాయా? అనే అనుమానాలకు తావి స్తోంది. వరుసగా మూడు కేబినెట్ సమావేశాలకు డిప్యూటీ సీఎం డుమ్మా కొట్టడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# జనసేన పార్టీ పల్నాడు పార్లమెంట్ అబ్జర్వర్స్ టీమ్ బత్తుల కేశవ్



**సత్తెనపల్లిన్యూస్, క్రోసూరు (ఆగస్టు 3) :** క్రోసూరు మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు బత్తుల కేశవ్ కు పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలో భాగంగా ఆయనను పల్నాడు పార్లమెంట్ అబ్జర్వర్స్ టీమ్ సభ్యుడిగా నియమించారు. సోమవారం ఆయన నియామక సమాచారం వెలువడటంతో మండలంలోని పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించే అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బత్తుల కేశవ్ ను కలసి పుష్ప గుచ్చాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జనసేన అధిష్టానానికి, తనకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులకు, కార్యకర్తల కు బత్తుల కేశవ్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సత్తెనపల్లి డీఎస్పీగా ఎంవీకే చైతన్య బాధ్యతల స్వీకారం



**సత్తెనపల్లి న్యూస్ :** సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని సత్తెనపల్లి నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డీఎస్పీ గా ఎంవీకే చైతన్య సోమవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయనకు స్థానిక పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు మరియు స్థానిక ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు, పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎంవీకే చైతన్య మాట్లాడుతూ సత్తెనపల్లి డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. శాంతియుత వాతావరణాన్ని కాపాడటంతో పాటు, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.




## అప్పుల ఊబిలో ఆంధ్రా రైతులు

**అమరావతి:** రాష్ట్రంలోని రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. అత్యధిక వ్యవసాయ అప్పుల్లో ఆంధ్రప్రదేశ్ రైతులు దేశంలోనే రెండో స్థానంలో ఉన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి మన రాష్ట్ర రైతుల అప్పులు రూ.2,69,415.73 కోట్లకు చేరాయి. ఈ విషయాన్ని సోమవారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. దేశంలో రూ.లక్ష కోట్లకు పైగా వ్యవసాయ రుణాలు గల రైతులు ఆరు రాష్ట్రాల్లో ఉన్నారని తెలిపారు. దేశంలో అత్యధిక వ్యవసాయ అప్పులు గల రైతులు తమిళనాడులో ఉండగా, రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ రైతులు ఉన్నారని వివరించారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల రైతులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఉపశమనం కల్పించేందుకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో ఉన్న రైతుల అప్పులను ఆర్థిక పునర్‌వ్యవస్థీకరణ చేపట్టేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. అయితే, సన్న, చిన్నకారు రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో లేదని పంకజ్ చౌదరి స్పష్టంచేశారు.

## జపాన్‌లో భారీ భూకంపం..

**టోక్యో:** జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.1గా నమోదైంది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో 10 అడుగుల మేర అలలు ఎగసి పడొచ్చని జపాన్ వాతావరణ ఏజెన్సీ వెల్లడించింది. దక్షిణ క్యూషు ద్వీపంలోని కుమామోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఓయిటా ప్రాంతాలకు అత్యవసర భూకంప హెచ్చరికలు జారీ చేసింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సముద్ర తీరాలకు దూరంగా.. ఎత్తైన ప్రదేశాల్లో ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టాలకు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది.

**చైనాలో 5.8 తీవ్రతతో భూకంపం..** చైనాలోనూ 5.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. మంగళవారం ఉదయం కేవలం 18 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించాయి. వీటి తీవ్రతలు 5.7.. 5.8గా నమోదయ్యాయి. భూకంప కేంద్రం ఉపరితలం నుంచి ఇవి 10 కిలోమీటర్ల లోతులో ఉంది. భూమి కంపించడంతో కొండల నుంచి భారీగా దుమ్ము ఎగసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## సీజేపీపై బీజేపీ ఆగ్రహం

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కి చెందిన ప్రముఖులు పార్టీ చేసుకుంటున్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో ప్రత్యక్షమయ్యింది. దీనిని చూసిన బీజేపీ నేతలు ఆగ్రహం వ్యకం చేస్తూ, సీజేపీ తీరును 'ద్వంద్వ వైఖరి'గా అభివర్ణించారు. సీజేపీ పార్టీ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెజాద్ పూనావాలా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ పెద్ద పార్టీని ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు సంఘీభావం తెలుపుతున్నామనేది ఇలాగేనా? అని సీజేపీని నిలదీశారు. ఈ విమర్శలకు సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ సమాధానమిచ్చారు. వర్తమాన యువత ఆలోచనా విధానాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకోలేకపోతున్నాయన్నారు. తాము రోడ్లపై కూర్చొని నిరసన తెలుపగలమని, డ్యాన్స్ చేస్తూ పోరాడగలమని సమర్థించుకున్నారు. తమ తరానికి నచ్చినట్లుగా ఉండటం తెలుసని, ఇతరులు నిర్దేశించిన పద్ధతుల్లో జీవించడం రాదని పేర్కొన్నారు.

## పెరిగిన ఎయిడ్స్ మరణాలు

**ముంబై:** ప్రాణాంతక హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ దేశ వాణిజ్య రాజధాని ముంబైలో వ్యాధి పీడితులు, మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం ఆరోగ్యశాఖను ఆందోళనకు గురిచేస్తోంది. గడచిన నాలుగేళ్లలో ఎయిడ్స్‌తో మృతిచెందినవారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. గత రెండేళ్లలో వేయికిపైగా రోగులు మృతిచెందినట్లు ఆరోగ్య శాఖ నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం కేవలం ముంబైలోనే 2022--23లో 958 మంది మృతి చెందగా, 2023-24లో 986 మంది, 2024--25లో 1,148 మంది, 2025-26లో 1,068 మంది మరణించారు. 2022-23తో పోలిస్తే 2025-26లో ఎయిడ్స్‌తో మృతి చెందిన రోగుల శాతం 19.83గా నమోదైంది. హెచ్ఐవీ, ఎయిడ్స్ మృతుల సంఖ్యను నియంత్రించేందుకు ఆరోగ్య శాఖ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అవగాహనా, ప్రచార కార్యక్రమాలను ఉధృతం చేసింది. అయినా రోగుల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) వెల్లడించింది.

## నీటిలో 631 గ్రామాలు..

**డిస్పూర్:** అస్సాంలో భీకర వరదలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో వరద తీవ్రత కారణంగా సుమారు 4.45 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిజాస్టర్ రిపోర్టింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీఆర్ఐఎంఎస్) నివేదిక ప్రకారం శివసాగర్, గోలాఘాట్, చరైదేవ్, జొర్హాట్, నాగావ్, కామరూప్ (మెట్రోపాలిటన్) జిల్లాల్లో వరద పరిస్థితి అత్యంత భీకరంగా ఉంది. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఏఎస్‌డీఎంఏ) వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి నాటికి 21 రెవెన్యూ సర్కిళ్ల పరిధిలోని 631 గ్రామాలు నీటమునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో చరైదేవ్ జిల్లా అత్యధికంగా నష్టపోయింది. ఇక్కడ 1.88 లక్షల మంది ప్రభావితం కాగా, శివసాగర్ జిల్లాలో 1.44 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. నుమాలిగఢ్ వద్ద ధాన్సిరి నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 37,139 హెక్టార్లలో పంట పొలాలు నీటమునిగాయి. అలాగే 2.56 లక్షలకు పైగా మూగజీవాలు వరద బారిన పడగా, సుమారు 26 వేలకు పైగా పశువులు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా 184 పునరావాస శిబిరాలు, సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో 28,695 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 97 మంది గర్భిణులు, బాలింతలు, 42 మంది దివ్యాంగులు ఉన్నారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు స్థానిక యంత్రాంగంతో కలిసి 67 పడవలను వినియోగించి, సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. వరద నీటి కారణంగా పలు ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురికాగా, 171 ఇళ్లు పూర్తిగా, 4,667 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. శివసాగర్, జొర్హాట్ జిల్లాల్లో కొన్ని ప్రాథమిక పాఠశాలలు నీటమునిగాయి. బాధితులకు బియ్యం, కందిపప్పు, ఉప్పు వంటి నిత్యావసర సరుకులను ప్రభుత్వం అందజేస్తోంది. ప్రధాన మంత్రి మోదీ, ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# బుద్ధభూమికి ప్రపంచ పట్టం



- సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా
- భారత్ ఖాతాలో 45వ ప్రపంచ వారసత్వ ప్రదేశం
- బుద్ధుడి తొలి ధర్మబోధకు వేదికైన క్షేత్రానికి అంతర్జాతీయ గౌరవం
- 2,500 ఏళ్ల బౌద్ధ వారసత్వానికి అరుదైన గుర్తింపు
- ధమేఖ్, ధర్మరాజిక, చౌఖండి స్తూపాలతో చరిత్రకు సజీవ సాక్ష్యం
- దక్షిణ కొరియాలో ప్రపంచ వారసత్వ కమిటీ 48వ సమావేశంలో కీలక నిర్ణయం



**న్యూ ఢిల్లీ:** రెండున్నర వేల ఏళ్ల క్రితం అక్కడ వినిపించిన బుద్ధుడి తొలి ధర్మబోధ.. నేడు ప్రపంచ వారసత్వంగా వెలుగొందుతోంది. కరుణ, జ్ఞానం, శాంతి సందేశాలతో బౌద్ధ ధర్మానికి దిశా నిర్దేశం చేసిన పవిత్ర భూమి సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ కిరీటం దక్కింది. బుద్ధుడి తొలి ఉపదేశానికి వేదికగా, శతాబ్దాల బౌద్ధ చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఈ ప్రాచీన క్షేత్రం ఇప్పుడు మాన వాళి ఉమ్మడి వారసత్వ సంపదగా ప్రపంచ పటంలో స్థానం సంపాదించింది. సారనాథ్ చేరికతో భారత్‌లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల సంఖ్య 45కు చేరింది.

**బుద్ధుడు తొలిసారి ధర్మాన్ని బోధించిన నేలకు ప్రపంచ పట్టం దక్కింది. రెండున్నర వేల ఏళ్లుగా శాంతి, కరుణ, జ్ఞాన సందేశాలను ప్రపంచానికి చాటుతున్న సారనాథ్.. ఇక యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద. ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి సమీపంలో ఉన్న 'ప్రాచీన బౌద్ధ క్షేత్రం-సారనాథ్'ను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చారు. దీంతో భారత్‌లో ప్రపంచ వారసత్వ హోదా పొందిన ప్రదేశాల సంఖ్య 45కు చేరింది.**

**దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జరుగుతున్న యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 48వ సమావేశంలో ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది బౌద్ధులకు అత్యంత పవిత్రమైన సారనాథ్‌కు ఈ గుర్తింపు దక్కడంతో భారత సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వంలో మరో మణిహారం చేరింది.**

### తొలి ధర్మచక్రం తిరిగింది ఇక్కడే..

బౌద్ధ పవిత్ర గ్రంథాల ప్రకారం గౌతమ బుద్ధుడు క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దంలో జ్ఞానోదయం పొందిన అనంతరం సారనాథ్‌కు చేరుకున్నారు. ఇక్కడే తన తొలి శిష్యులను కలుసుకుని మొదటి ధర్మోపదేశం చేశారు. బౌద్ధ బోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి ఈ ఘట్టమే ఆరంభంగా భావిస్తారు.

ఆ తర్వాత శతాబ్దాలపాటు సారనాథ్ బౌద్ధ విద్య, ఆధ్యాత్మికత, యాత్రలకు ప్రధాన కేంద్రంగా వర్ధిల్లింది. వివిధ కాలాల్లో పాలకులు, దాతలు, బౌద్ధ సంఘాలు ఇక్కడ స్తూపాలు, ఆలయాలు, విహారాలను నిర్మించాయి. కాలగమనంలో ఇది ప్రపంచంలోని నాలుగు ప్రధాన బౌద్ధ యాత్రా క్షేత్రాల్లో ఒకటిగా విశిష్ట స్థానం సంపాదించింది.

### రాళ్లలో చెక్కిన రెండున్నర వేల ఏళ్ల చరిత్ర

సారనాథ్ వైభవాన్ని నేటికీ అక్కడి పురావస్తు సంపద కళ్లకు కడుతోంది. చౌఖండి స్తూపం, సారనాథ్ పురావస్తు అవశేషాల పరిధిలోని ధమేఖ్ స్తూపం, ధర్మరాజిక స్తూపం ఈ చారిత్రక వారసత్వంలో ప్రధానమైనవి. ఈ ప్రాంతం చారిత్రకంగా లిలి'డీర్ పార్క్'లిలిగా ప్రసిద్ధి చెందింది.

బౌద్ధ సంప్రదాయాలు, పవిత్ర గ్రంథాల్లో సారనాథ్‌ను రిషిపట్న, ఇసిపట్న, మృగదావ తదితర పేర్లతోనూ ప్రస్తావించారు. భిన్న కాలాల చరిత్రను తనలో దాచుకున్న ఈ నేల ఇప్పుడు ప్రపంచ మానవాళి ఉమ్మడి వారసత్వ సంపదగా గుర్తింపు పొందింది.

### 'భారత్‌కు అభినందనలు'

సారనాథ్‌కు ప్రపంచ వారసత్వ హోదా దక్కడంపై యునెస్కో దక్షిణాసియా ప్రాంతీయ కార్యాలయ డైరెక్టర్, ప్రతినిధి టిమ్ కర్టిస్ భారత ప్రభుత్వం, ప్రజలకు అభినందనలు తెలిపారు.

2,500 ఏళ్లకు పైగా సారనాథ్ ప్రపంచవ్యాప్తంగా బౌద్ధులకు యాత్రా క్షేత్రంగా, స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తోందని పేర్కొన్నారు. బుద్ధుడు ఇక్కడ చేసిన తొలి బోధనలోని కరుణ, జ్ఞానం, శాంతి సందేశాలు నేటికీ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ఇక్కడి ఆలయాలు, స్తూపాలు, విహారాలు శతాబ్దాల విశ్వాసానికి, మానవాళి ఉమ్మడి వారసత్వానికి సాక్ష్యాలని పేర్కొన్నారు.

### ప్రపంచ పటంలో భారత వారసత్వ ముద్ర

1972 ప్రపంచ వారసత్వ ఒప్పందం ప్రకారం విశిష్టమైన సాంస్కృతిక లేదా సహజ ప్రాధాన్యం కలిగి, జాతీయ సరిహద్దులకు అతీతంగా మొత్తం మానవాళికి విలువైన ప్రదేశాలను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేరుస్తోంది.

సారనాథ్ చేరికతో భారత్‌లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల సంఖ్య 45కు చేరింది. ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల్లోని 1,248 సాంస్కృతిక, సహజ, మిశ్రమ ప్రదేశాలు ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో ఉన్నాయి.

### శాంతి సందేశానికి ప్రపంచ గౌరవం

జ్ఞానోదయం అనంతరం బుద్ధుడి తొలి బోధనకు వేదికైన సారనాథ్.. శతాబ్దాలు గడిచినా తన ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని కోల్పోలేదు. 'కరుణ.. జ్ఞానం.. శాంతి' అనే బుద్ధుడి సందేశం తొలిసారి ప్రపంచానికి వినిపించిన నేలకు ఇప్పుడు ప్రపంచ వారసత్వ కిరీటం దక్కింది. భారత చరిత్రలోనే కాకుండా ప్రపంచ బౌద్ధ వారసత్వంలోనూ సారనాథ్ ప్రాధాన్యాన్ని ఈ గుర్తింపు మరింత ఇనుమడింపజేసింది.

## ఎల్ నినో ఎఫెక్ట్: భూమికి పొంచి ఉన్న మరో ముప్పు?!




**ప్రపంచం ఇప్పటికే వాతావరణ మార్పుల సెగను ఎదుర్కొంటోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, తీవ్రమవుతున్న వేడిగాలులు, కరవు పరిస్థితులు.. మరోవైపు ఊహించని స్థాయిలో విరుచుకుపడుతున్న తుపాన్లు, వరదలు అనేక దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో పసిఫిక్ మహాసముద్రంలో చోటుచేసుకుంటున్న ఓ పరిణామం ప్రపంచాన్ని మరోసారి ఆందోళనకు గురిచేస్తోంది. సూపర్ ఎల్‌నినో.. గాడ్జిల్లా ఎల్‌నినో అంటూ చర్చకు వచ్చిన ఈ వాతావరణ ప్రభావం 2026పైనే అందరి దృష్టిని మళ్లించింది. అయితే శాస్త్రవేత్తల తాజా అంచనాలు మాత్రం అసలు ప్రభావం మరింత ఆలస్యంగా కనిపించే అవకాశాన్ని సూచిస్తున్నాయి.**

ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే.. 2026 ప్రపంచంలో రెండో అత్యంత వేడిగల సంవత్సరంగా నిలిచే అవకాశం ఉందని అంటోంది. మరి మొదటి ఏడాది?. దానికి ఎంతో సమయం పట్టకపోవచ్చని అంటున్నారు. 2027 మాత్రం గత శతాబ్దానికి పైగా ఉన్న ఉష్ణోగ్రత రికార్డులను సవాలు చేసే స్థాయికి చేరవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో పరిస్థితులను పేర్కొంటున్నారు.

**సముద్రంలో దాగిన వేడి.. భూమిపై ప్రభావం**

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సహజంగా సంభవించే వాతావరణ మార్పు. సాధారణ పరిస్థితుల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు.. ఆ వేడి ప్రపంచవ్యాప్తంగా గాలుల కదలికలు, వర్షపాతం, ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో భారీ స్థాయిలో వేడి నిల్వ ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. సముద్రం లోపల పేరుకుపోయిన ఈ వేడి క్రమంగా పైకి వచ్చి వాతావరణ వ్యవస్థలోకి చేరినప్పుడు.. ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రస్తుత ఎల్ నినోను 1997-98లో నమోదైన అత్యంత బలమైన ఎల్ నినోతో శాస్త్రవేత్తలు పోలుస్తున్నారు. అప్పట్లో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాలు, వరదలు, కరువులు సంభవించాయి. అయితే ఈసారి పరిస్థితులు మరింత భిన్నంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే అప్పటితో పోలిస్తే ఇప్పుడు భూమి ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో మరింత వేడెక్కిపోయింది.

**2026లో మొదలై.. 2027లో తీవ్ర ప్రభావం?**

ఎల్ నినో ప్రభావం ఏర్పడిన వెంటనే బయటపడదు. సముద్రంలో మార్పులు చోటుచేసుకున్న తర్వాత వాటి ప్రభావం వాతావరణ వ్యవస్థపై పడేందుకు కొంత సమయం పడుతుంది. అందుకే సాధారణంగా ఎల్ నినో ఏర్పడిన ఏడాది కంటే.. తర్వాతి ఏడాదిలో దాని ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఇదే కారణంగా 2026లో బలపడుతున్న ఎల్ నినో ప్రభావం 2027లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే వాతావరణంలో పెరిగిన గ్రీన్‌హౌస్ వాయువులు వేడిని బంధిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎల్ నినో ప్రభావం కలవడంతో ఉష్ణోగ్రతలు గత అంచనాలను మించి పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మారనున్న ప్రపంచ వాతావరణ ముఖచిత్రం!**

బలమైన ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సమతుల్యతను ప్రభావితం చేయగలదు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటే.. మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర పొడి పరిస్థితులు ఏర్పడవచ్చు. దక్షిణ అమెరికా, తూర్పు ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉండగా.. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆగ్నేయాసియా ప్రాంతాల్లో ఎండలు, కరవు పరిస్థితులు పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా వేడిగాలుల తీవ్రత మరింత పెరగవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల తుఫాన్ల తీవ్రత, వాటి ప్రయాణ మార్గాల్లో కూడా మార్పులు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్ నినో ప్రభావం భారత వాతావరణంపై కూడా పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపై దీని ప్రభావం కనిపించే సందర్భాలు గతంలో ఉన్నాయి. కొన్ని బలమైన ఎల్ నినో పరిస్థితుల సమయంలో వర్షపాతం తగ్గిన ఉదాహరణలు నమోదయ్యాయి. అయితే భారత రుతుపవనాలను ఎల్ నినో ఒక్కటే నిర్ణయించదు. హిందూ మహాసముద్ర ఉష్ణోగ్రతలు, గాలుల మార్పులు, స్థానిక వాతావరణ పరిస్థితులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అయినప్పటికీ ఎల్ నినో బలపడితే వ్యవసాయం, నీటి వనరులు, వేసవి ఉష్ణోగ్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**సహజ మార్పా? మానవ తప్పిదాల ప్రభావమా?**

ఎల్ నినో అనేది సహజంగా జరిగే ప్రక్రియే అయినప్పటికీ.. ప్రస్తుతం దాని ప్రభావం తీవ్రంగా కనిపించడానికి గ్లోబల్ వార్మింగ్ కూడా ఒక ముఖ్య కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బొగ్గు, చమురు, సహజ వాయువుల వినియోగం వల్ల పెరుగుతున్న కార్బన్ ఉద్గారాలు భూమి ఉష్ణోగ్రతలను నిరంతరం పెంచుతున్నాయి. దీంతో సహజ వాతావరణ మార్పులు వచ్చిన ప్రతిసారి వాటి ప్రభావం గతంతో పోలిస్తే మరింత తీవ్రంగా కనిపించే పరిస్థితి ఏర్పడుతోంది.

**మరో వేడి రికార్డుకు రంగం సిద్ధమా?**

ప్రస్తుత అంచనాలు నిజమైతే.. 2027 భూమి చరిత్రలోనే అత్యంత వేడిగల సంవత్సరంగా నిలిచే అవకాశం ఉంది. ఇది కేవలం ఉష్ణోగ్రతల రికార్డు మాత్రమే కాదు.. మారుతున్న వాతావరణ పరిస్థితులు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లకు ఒక ముందస్తు హెచ్చరికగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో పేరుకుపోతున్న వేడి రాబోయే నెలల్లో ప్రపంచ వాతావరణంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సి ఉంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది.. భూమి వేడెక్కే వేగం ఇంకా తగ్గడం లేదు. కొత్త ఉష్ణోగ్రత రికార్డులకు వాతావరణం మరోసారి వేదికగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

## రథయాత్రలో కాజాలకు గిరాకీ



**పూరీ:** జగన్నాథ రథయాత్ర సందర్భంగా 'పూరీ కాజా' విక్రయాలలో సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. పది రోజుల ఉత్సవాల్లో దాదాపు రూ.100 కోట్ల విలువైన కాజా అమ్ముడైనట్లు వర్తకులు చెబుతున్నారు. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో ఈ తియ్యని పదార్థానికి గిరాకీ అనూహ్యంగా పెరిగింది. ఈ ఏడాది రథయాత్రకు ముప్పై లక్షలకు పైగా భక్తులు పూరీకి తరలివచ్చారు. దీంతో శ్రీమందిర్ ఆనంద్ బజార్, అడపా మండప్ ఆనంద్ బజార్‌తో పాటు గ్రాండ్ రోడ్, నగర వీధులు, పూరీ-భువనేశ్వర్ హైవే వెంట వెలిసిన వందలాది దుకాణాల్లో కాజా విక్రయాలు జోరుగా సాగాయి.

గత సంవత్సరాలతో పోలిస్తే విక్రయ కేంద్రాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. భక్తులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం ఒక్కొక్కరు 2 నుంచి 5 కిలోల వరకు కాజాను కొనుగోలు చేసి తీసుకెళ్లారు. స్వచ్ఛమైన నెయ్యితో తయారు చేసిన ప్రీమియం రకం కిలో సుమారు రూ.400 పలుకగా, సాధారణ రోడ్డు పక్కన విక్రయించే రకాలు రూ.200 నుంచి రూ.300 వరకు అమ్ముడయ్యాయి. పండుగ రద్దీని ఆసరా చేసుకుని కొన్ని చోట్ల సాధారణ కాజాను కూడా 'కాళీయ భోగం' అంటూ కొందరు విక్రేతలు అమాయక భక్తులను మోసగించారనే ఆరోపణలు వినిపిస్తునాయి. జగన్నాథ సంప్రదాయాల పవిత్రతను దెబ్బతీసే ఈ చర్యలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం శ్రీమందిర్ ఆనంద్ బజార్‌లోనే రూ.40 కోట్ల విలువైన మహాప్రసాదం అమ్ముడైనట్లు అంచనా. మరోవైపు పూరీ కాజాకు అంతర్జాతీయ ఖ్యాతి ఉన్నప్పటికీ, దీనికి ఇప్పటివరకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) లభించలేదు. దీని ప్రత్యేకతను కాపాడేందుకు, ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించడానికి జీఐ ట్యాగ్ ఇవ్వాలనే డిమాండ్ మళ్లీ ఊపందుకుంది.

## శబరిమల ప్రధాన తంత్రిగా బ్రహ్మదత్తన్

**పతనంతిట్ట:** తిరువనంతపురంలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో , ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డ్ కందరారు రాజీవర్ కుమారుడైన బ్రహ్మదత్తన్ శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రధాన తంత్రిగా నియమించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని బోర్డు సోమవారం కేరళ హైకోర్టుకు తెలియజేస్తుంది. బ్రహ్మదాతన్ చింగం 1 (ఆగస్టు 16) నాడు బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్రహ్మదతన్ తాంత్రిక కర్మలలో అవసరమైన నైపుణ్యాన్ని కలిగి ఉన్నాడని నిర్ధారించిన అక్కిరామోన్ కాళిదాస్ భట్టతిరిపాడ్ , తరాయిల్ కుజిక్కట్టు అగ్నిశర్మన్ వాసుదేవన్ భట్టతిరి మరియు కడియకోల్ సుబ్రహ్మణ్యన్ నంబూతిరిలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ సిఫార్సును అనుసరించి ఈ నిర్ణయం తీసుకుంది. బ్రహ్మదాతన్ ఒక తాంత్రిక సంస్థలో అధ్యయనంతో సహా తంత్రంలో అధికారిక శిక్షణ పొందారని, అలాగే శబరిమలలో తన తండ్రికి సహాయకుడిగా కూడా పనిచేశారని కమిటీ దేవస్థానం బోర్డు అధ్యక్షుడికి తెలియజేసింది.

# పెరుగుతున్న గోదావరి



**అమరావతి/ధవళేశ్వరం:** మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ వర్షాలు కురుస్తుండటంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వరద దిగువకు వదిలేస్తుండటంతో భద్రాచలం వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయానికి 14.26 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. నీటి మట్టం 53 అడుగులకు చేరుకుంది. దాంతో అధికారులు భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

పోలవరం ప్రాజెక్టులోకి చేరుతున్న వరద గంట గంటకూ పెరుగుతోంది. స్పిల్ వే 48 గేట్ల ద్వారా వచ్చిన వరదను దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీలోకి 5,39,934 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 11 వేల క్యూసెక్కులు, మిగులుగా ఉన్న 5,28,934 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. అలాగే, శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణా నది వరద ప్రవాహం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటులకు 92,709 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 54.34 టీఎంసీలకు చేరుకుంది.

రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. విదర్భ, మధ్యప్రదేశ్ ప్రాంతంపై ఉన్న వాయుగుండం వాయవ్య దిశగా కదులుతూ వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది. నైరుతి గాలులతో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు వెల్లడించింది. గత 24 గంటల్లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో అత్యధికంగా 3.7,ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం వేమవరం, కాకినాడ జిల్లా ఇంజారంలో 3.2 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

## 'భోగాపురం.. చంద్రబాబు పాత్ర ఏమీ లేదు'

**తాడేపల్లి:** భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రారంభంపై వైఎస్సార్‌సీపీ స్పందించింది. రాష్ట్రానికి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందించిన వైఎస్ జగన్ అన్నకు ధన్యవాదాలంటూ పోస్టు చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి జగన్ శ్రీకారం చుట్టారని.. ఈ ప్రాజెక్టులో చంద్రబాబు పాత్ర ఏమీ లేదని స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ ఎక్స్ వేదికగా..'రాష్ట్రానికి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అందించిన వైఎస్ జగన్ అన్నకు ధన్యవాదాలు. వైఎస్ జగన్ హయాంలో ఎయిర్‌పోర్టు భూసేకరణకు దాదాపు రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించటంతోపాటు, అవసరమైన అన్ని అనుమతులు సాధించారు. ప్రాజెక్టుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి జగన్ శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులో చంద్రబాబు పాత్ర ఏమీ లేదు. అయినప్పటికీ మొత్తం ఘనతను తనదేనని చెప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ఈ ఎయిర్‌పోర్టుకు పునాది వేసి, దాన్ని సాధ్యం చేసిన నాయకుడు ఎవరో ప్రజలకు బాగా తెలుసు. అందుకే వారంతా థ్యాంక్యూ జగన్ అన్నా అంటూ మనస్ఫూర్తిగా చెబుతున్నారు' అని పోస్టు చేసింది.

## బయట ఏమైనా చేసుకోండి కానీ..



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న తీరుపై నేషనలిస్ట్ సిటిజన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) ఎంపీ సాయోని ఘోష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల ఆందోళన కారణంగా ప్రజా సమస్యలను ప్రస్తావించలేకపోతు న్నామని అన్నారు. వరుస అంతరాయాల కారణంగా ప్రజా ధనం వృథా అవుతోందని పేర్కొన్నారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ సజావుగా సాగేందుకు అధికార, విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగడం లేదు. ప్రతిరోజూ సభకు అంతరాయం కలుగుతోంది, పన్ను చెల్లింపుదారుల డబ్బు వృథా అవుతోంది. ప్రశ్నోత్తరాల సమయంలో గానీ, జీరో అవర్‌లో గానీ మా నియోజకవర్గ సమస్యలను లేవనెత్తలేకపోతున్నాం. ఇది చాలా బాధాకరం, ముఖ్యంగా మా నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను వినిపించాలని మాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సభను సజావుగా పనిచేయనివ్వాలని అభ్యర్థిస్తున్నాను. బయట మీరు ఏమైనా చేసుకోండి, కానీ సభ లోపల పార్లమెంటును సజావుగా నడపడం అధికార పక్షం, ప్రతిపక్షం ఇద్దరి బాధ్యత''ని ఎంపీ సాయోని ఘోష్ అన్నారు.

## సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల :** తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మో త్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా రు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమై , ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు , సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వాహన సేవలు ఉంటాయని టీటీడీ అధికారులు తెలిపారు. 15వ తేదీన సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం. 16న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనంపై స్వామివారు మాడ వీధుల గుండా విహరిస్తారని తెలిపారు. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం, 18న ఉదయం 8 గంటలకు కల్ప వృక్షం వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనంపై ఊరేగుతారని వివరించారు. 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం, 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం, 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటల కు చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని తెలిపారు. 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, 23 ఉదయం 6 నుంచి 9 వరకు చక్ర స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్స వాలు ముగుస్తాయని వివరించారు.

# ఈ ప్రాథమిక వైద్య పరికరాలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండాల్సిందే..

**సత్తెనపల్లి న్యూస్ :** ఇంట్లో పిల్లలు, వృద్ధులు లేదా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి వంటి కీలక ఆరోగ్య సూచీలను ఎప్పటికప్పుడు గమనించడం చాలా ముఖ్యం. ఇందుకోసం కొన్ని ప్రాథమిక వైద్య పరికరాలను ఇంట్లోనే ఉంచుకోవడం అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుంది. అయితే ఈ పరికరాల్లో అసాధారణ రీడింగ్ కనిపించగానే భయపడకుండా, ప్రశాంతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ థర్మామీటర్, బీపీ మానిటర్, పల్స్ ఆక్సీమీటర్, అవసరమైతే గ్లూకోమీటర్, నెబ్యులైజర్, అలాగే ఫస్ట్ ఎయిడ్ కిట్ ప్రతి ఇంట్లో ఉండటం మంచిది. ఇవి ఆరోగ్య పరిస్థితిలో వచ్చే మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు సహాయపడతాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిలో ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అత్యవసర సమయంలో కుటుంబ సభ్యుల్లో భయాందోళనలు తగ్గించి, వైద్యులకు సరైన సమాచారం అందించడంలో కూడా ఈ పరికరాలు ఉపయోగపడతాయి.

### హెచ్చరికగా భావించాలి..

అయితే ఏదైనా పరికరంలో అసాధారణ రీడింగ్ కనిపించిన వెంటనే అది తీవ్రమైన సమస్య అని భావించకూడదు. మొదట కనిపించిన రీడింగ్‌ను ఒక హెచ్చరికగా మాత్రమే పరిగణించి, మరో సారి సరిచూసుకోవడం అవసరం. ఎందుకంటే కొన్నిసార్లు పరికరాన్ని సరిగా ఉపయోగించకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా తప్పుడు రీడింగ్ వచ్చే అవకాశం ఉంటుంది. రక్తపోటు ఎక్కువగా లేదా చాలా తక్కువగా కనిపిస్తే ముందుగా కొద్దిసేపు ప్రశాంతంగా కూర్చొని మళ్లీ బీపీని పరీక్షించాలి. డైనింగ్ కుర్చీలో నిటారుగా కూర్చొని, చేతిని టేబుల్‌పై సపోర్ట్ ఇచ్చి కొలిస్తే సరైన ఫలితం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆందోళన, నొప్పి, ఇటీవల చేసిన శారీరక శ్రమ, బీపీ కఫ్‌ను సరిగా ధరించకపోవడం వంటి కారణాల వల్ల కూడా రీడింగ్ మారుతుంది. అలాగే బీపీ కొలిచే ముందు కనీసం గంటపాటు టీ, కాఫీ తాగకుండా ఉండాలి. దగ్గు మందులు, ముక్కు దిబ్బడ తగ్గించే మందులు లేదా నెబ్యులైజేషన్ వాడిన తర్వాత కూడా బీపీ, పల్స్ తాత్కాలికంగా పెరిగే అవకాశం ఉంటుంది.

### రీడింగ్ అసాధారణంగా ఉంటే..

గ్లూకోమీటర్‌లో రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా



లేదా తక్కువగా కనిపిస్తే ముందుగా చేతులను శుభ్రంగా కడిగి మళ్లీ పరీక్షించాలి. వేళ్లపై ఆహార అవశేషాలు లేదా శానిటైజర్, స్పిరిట్ అవశేషాలు ఉండటం వల్ల కూడా తప్పు రీడింగ్ వస్తుంది. చెమటలు పట్టడం, తల తిరగడం, అయోమయం, తీవ్రమైన దాహం వంటి లక్షణాలు కూడా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మరో వేలితో మళ్లీ పరీక్షించడం లేదా సాధ్యమైతే మరో గ్లూకోమీటర్‌తో పోల్చి చూడడం కూడా మంచిది. థర్మామీటర్‌లో అధిక జ్వరం నమోదైతే ముందుగా ఉష్ణోగ్రతను సరిగ్గా కొలిచామా లేదా అని నిర్ధారించుకోవాలి. శరీరానికి తగినంత నీరు అందేలా చూసుకోవాలి. జ్వరం ఎక్కువసేపు కొనసాగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అయోమయం లేదా ఫిట్స్ వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలి.

### లక్షణాలు కూడా ఉంటే..

పల్స్ ఆక్సీమీటర్‌లో ఆక్సిజన్ స్థాయి తక్కువగా కనిపిస్తే చేతులను వెచ్చగా ఉంచి, కదలకుండా కొద్దిసేపు ఉండి మళ్లీ పరీక్షించాలి. చల్లని వేళ్లు, రక్తప్రసరణ సరిగా లేకపోవడం లేదా పరికరాన్ని సరిగ్గా అమర్చకపోవడం వల్ల కూడా తక్కువ రీడింగ్ వస్తుంది. మళ్లీ పరీక్షించిన తర్వాత కూడా ఆక్సిజన్ స్థాయి తక్కువగానే ఉండి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలి. ఆరోగ్య పరికరాలు చూపించే సంఖ్యలు ఉపయోగకరమైన సూచనలు మాత్రమే. వాటితోపాటు శరీరంలో కనిపించే లక్షణాలను కూడా తప్పనిసరిగా గమనించాలి. అసాధారణ రీడింగ్ కనిపించినప్పుడు భయపడకుండా మరోసారి పరీక్షించి, అవసరమైతే వెంటనే వైద్య సలహా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# 'సర్' ఓటర్లు 3,71,38,182

**సత్తెనపల్లి న్యూస్, అమరావతి :** రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అనంతరం ముసాయిదా జాబితాలో 3,71,38,182 మంది ఓటర్లున్నారు. 'సర్'కు ముందు 4,16,27,694 మంది ఓటర్లు ఉండగా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు, రెండు మూడు చోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు, మృతులను మినహాయించి 3,71,38,182 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు.

సర్ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను శుక్రవారం ఆయన ప్రకటించారు. 89.22 శాతం మంది ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని వారు ఓటరుగా నమోదుకు వచ్చే నెలాఖరు వరకు ఫారం 6 సమర్?పంచవచ్చు. నిజమైన ఓటర్లు డిక్లరేషన్ ఫారమ్‌తో పాటు ఫారం 6 అందచేస్తే ఓటర్ల జాబితాలో తిరిగి చేరే అవకాశం ఉంది. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదైతే ఒకచోట మాత్రమే ఉంచుతారు.

అక్టోబర్ 3వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు. సర్ అనంతరం 15.22 లక్షల మంది ఓటర్లు (3.66 శాతం) మృతి చెందినట్లు తేలింది. 22.30 లక్షల మంది అంటే 5.33 శాతం శాశ్వతంగా మరో చోటకు తరలివెళ్లడం లేదా గైర్హాజరు అయినట్లు గుర్తించారు. మరో 7.37 లక్షల మంది ఓటర్లు (1.77 శాతం) రెండు లేదా మూడు చోట్ల నమోదైనట్లు వెల్లడైంది. మొత్తం 44,89,512 మంది అంటే 10.78 శాతం ఓటర్లుగా క్లెయిమ్ చేయలేదు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పురుషులు కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

మహిళా ఓటర్లు 1.89 కోట్ల మంది కాగా పురుష ఓటర్ల సంఖ్య 1.82 కోట్లు మాత్రమే. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 18,12,532 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా పోలవరం జిల్లాలో 2,39,591 మంది ఓటర్లున్నారు. నోటీసు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఏ ఒక్కరి ఓటు తొలగించబోమని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. సహేతుకమైన అవకాశం ఇస్తామున్నారు. అర్హుడైన ప్రతి పౌరుడిని ఓటర్ల జాబితాలో కొనసాగించడం, అనర్హులను జాబితాలో లేకుండా చూసేందుకు ఎన్నికల కమిషన్ కట్టుబడి ఉందన్నారు. ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి సెప్టెంబర్ 28లోగా పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 3న ప్రచురిస్తారు.

# అరుదైన నాయకుడు ముద్రగడ: వైఎస్సార్‌సీపీ నాయకులు



**సత్తెనపల్లి న్యూస్, కాకినాడ:** ఏపీ రాజకీయాల్లో సామాజిక ముద్ర వేసుకున్న వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని కొనియాడారు వైఎస్సార్‌సీపీ నేతలు. అరుదైన రాజకీయ నాయకుడు ముద్రగడ. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పోరాట పటిమతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో ముద్రగడకు ఎంతో గౌరవం ఉందన్నారు.

నేడు కిర్లంపూడిలో మద్రగడ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, అంబటి రాంబాబు, జక్కంపూడి విజయలక్ష్మి, గుడివాడ అమర్నాథ్, కరణం ధర్మశ్రీ, తానేటి వనిత, వేణుగోపాల కృష్ణ, వంగా గీతా, దవులూరి దొరబాబు సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 'ముద్రగడుకు ఆయనకు ఆయనే సాటీ. ఏ కార్యక్రమం చేసిన ఒక ధృడ సంకల్పంతో చేశారు. తాను చనిపోయాక ఎలాంటి కార్యక్రమాలు చేయవద్దని కుటుంబ సభ్యులకు చెప్పారు. అయితే, ముద్రగడ కుటుంబ సభ్యులను ఒప్పించి సంస్మరణ సభ నిర్వహించాం. ముద్రగడ సంస్మరణ సభ రాజకీయ సభ కాదు. రాజకీయాల కంటే కాపు ఉద్యమంలోనే ముద్రగడతో నాకు ఎక్కువ సన్నిహిత సంబంధం ఉంది. ముద్రగడ ఒక శక్తి. రంగాను పోగొట్టుకున్నాము ముద్రగడను పోగొట్టుకోలేమని దాసరి ఆనాడు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముద్రగడకు ఎంతో గౌరవం ఉంది.

అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఏపీ రాజకీయాల్లో సామాజిక ముద్ర వేసుకున్న వ్యక్తి. ఏ విషయం తీసుకున్నారో దానిని సాధించుకునేంత వరకు తన ప్రాణాన్ని పణంగా పెట్టేవారు. అరుదైన రాజకీయ నాయకుడు ముద్రగడ. పదవులు ఆయన్ను వరించాయి తప్ప.. ఆయన పదవుల కోసం పాకులాడలేదు. ముద్రగడ రాజీనామాలు స్ఫూర్తినిచ్చాయి. ముద్రగడను స్ఫూర్తిగా తీసుకుని పోరాట పటిమతో ముందుకు సాగాలన్నారు.

జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ..'రాజకీయాల్లో ముద్రగడ విలువలతో కూడిన శాసనం. ఆతిథ్యం పేరు చెబితే ఏపీలో ముద్రగడను మించిన వారు లేరు. ముద్రగడ కోసం ఎంత మాట్లాడిన తక్కువే. పట్టుదల విషయంలో ముద్రగడ ఆయనకు ఆయనే సాటి. కాపు నేతగా ముద్రపడ్డా.. కులాలకు, మతాలకు అతీతంగా ముద్రగడ రాజకీయాలు చేశారు. ముద్రగడ లేరు అనే బాధ ఎక్కువగా ఉంది. ముద్రగడను అనుసరించిన ఆయన ఇల్లాలు పద్మావతికి నమస్కారం. ముద్రగడ ప్రతీ ఉద్యమంలో ఆయన సతీమణీ పద్మావతి ముద్ర ఉంది' అని చెప్పుకొచ్చారు.

# అస్సాంలో వరద విలయం



**దిస్పూర్:** అస్సాంలో భారీ వరదలు తీవ్ర వినాశనాన్ని సృష్టించాయి. వరదల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య 82కి చేరుకుందని అక్కడి అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,92,799 మంది వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉన్నట్లు పేర్కొన్నారు.

**వివిధ జిల్లాల్లో వరద తీవ్రత :** అధికారుల వివరాల ప్రకారం.. అసోంలోని శివసాగర్, గోలాఘాట్, జోర్హాట్, నాగావ్, చరైడియో జిల్లాలలో వరద ప్రభావం ఇంకా కొనసాగుతోంది. వాటిలో అత్యధికంగా చరైడియో జిల్లాలో 77,456 మంది, తర్వాతి స్థానాల్లో శివసాగర్‌లో 63,492 మంది, జోర్హాట్‌లో 34,067 మంది ప్రజలు వరదల వల్ల ప్రభావితమయ్యారు. వరదల ప్రభావితమైన వారి కోసం 54 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశామని అందులో దాదాపు 13,000 మంది బాధితులు ఆశ్రయం పొందుతున్నారని పేర్కొన్నారు. మరో 26 రిలీఫ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు పనిచేస్తుండగా, వాటి ద్వారా 5,384 మందికి సాయం అందుతోందన్నారు. బాధితుల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌లు రంగంలోకి దిగి సహాయక చర్యలను ముమ్మరంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు.

**వరద బాధితులకు ప్రభుత్వ ఊరట :** వరద పీడిత ప్రాంతాల్లోని ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పీఎం సూర్య ఘర్ పెండింగ్ రాష్ట్ర సబ్సిడీ కింద 9,289 మంది లబ్ధిదారులకు రూ. 41.67 కోట్లను ప్రభుత్వం ఆమోదించింది. అస్సాం పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా మంగళవారం (ఆగస్టు 4, 2026) నాటికి పూర్తి చేయాలని పవర్ డిపార్ట్‌మెంట్‌ను సీఎం ఆదేశించారు. అంతకు ముందు ప్రధాని మాట్లాడుతూ వరద బాధితులకు తక్షణ సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ నాలుగు జిల్లాల్లోని వరద బాధితులందరికీ రుణాలు చెల్లించడంలో ఆరు నెలల మారటోరియం వర్తింపజేయాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయించారు.

# కేరళలోని ఇడుక్కిలో భారీ వర్షాలు

**సత్తెనపల్లి న్యూస్ :** కేరళను భారీ వర్షాలు ముంచెత్తాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కొండచరియలు కూడా విరిగిపడుతున్నాయి. కేరళ, ఇడుక్కి, కొట్టాయం జిల్లాల్లో శనివారం భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి ముగ్గురు మరణించారు. అలాగే, ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. వాగమాన్ జిల్లాలో కూడా కొండచరియలు విరిగిపడటం వల్ల ఒకరు మరణించారు. ప్రభాకరన్ నాయర్ అనే అతడి మృతదేహం ఇంకా లభించలేదు. అడూర్‌మాలా ప్రాంతంలో కూడా కొండచరియలు విరిగిపడటంతో ఒకరు చిక్కుకుపోయారు. అలాగే, కోచి-ధనుష్‌కోడి నేషనల్ హైవే, మాచిప్లావు వద్ద కూడా కొండచరియలు విరిగిపడిన కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇడుక్కి జిల్లాలోని ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇంట్లో ఉన్న ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. కొట్టాయం జిల్లాలో శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారు. కేరళలోని అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అనేక చోట్ల భారీగా ట్రాఫిక్ స్తంభించింది. 183వ జాతీయ రహదారిపై వందిపెరియార్ ప్రాంతంలో నీళ్లు నిలిచిపోయాయి. దీంతో రోడ్డు మార్గం మొత్తం బ్లాక్ అయింది. మరోవైపు నీటి మట్టం ఇంకా పెరిగిపోతోంది. పైగా చుట్టుపక్కల డ్యామ్‌ల నుంచి గేట్లు ఎత్తడంతో ఈ రోడ్డుపైకి ఇంకా నీరు చేరే



అవకాశం ఉంది. ఎరాట్టుపేట, కంజిరాపల్లి, కూట్టిక్కల్, ఎరుమెలి వంటి అనేక పట్టణాలు కూడా నీట మునిగాయి. పూంజార్ ప్రాంతంలో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఇంట్లో ఇద్దరు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భారీ వర్షాలు, వరదల నుంచి ప్రజల్ని రక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళలోని వయనాడ్ సహా అనేక ప్రాంతాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరిస్తున్నారు. అనేక ప్రాంతాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేశారు.

# సముద్ర జలాల్లో చమురు అన్వేషణ కోసం 'సముద్ర మంథన్' పథకం



**సత్తెనపల్లి న్యూస్, ఢిల్లీ :** భారత ప్రాదేశిక సముద్ర జలాల్లో చమురు అన్వేషణకు కేంద్రం మరింత ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇందుకోసం 'సముద్ర మంథన్' పేరుతో కొత్త పథకాన్ని కేంద్రం అమలు చేయనుంది. ఈ పథకానికి తాజాగా కేంద్ర క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం వెల్లడించారు. 'సముద్ర మంథన్' పథకాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తారు. ఈ పథకం కింద భారత్‌కు హక్కు కలిగిన సముద్ర జలాలు, తీర ప్రాంతాల్లో చమురు అన్వేషణ చేపడతారు.

దీని ద్వారా చమురు నిల్వల్ని గుర్తించి, వెలికి తీస్తారు. ఈ పథకాన్ని 2030-31 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేస్తారు. ఇందుకోసం రూ.84,084 కోట్లు ఖర్చు పెడుతుంది ప్రభుత్వం. ఇండియాకు చెందిన ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధిలో భారీగా చమురు నిల్వలు ఉన్నాయని అంచనా. ఆయిల్, గ్యాస్ నిల్వలు ఇక్కడ పెద్ద స్థాయిలో ఉన్నాయి. వీటిని నూతన పథకం ద్వారా వెలికి తీస్తారు. చమురు నిల్వల్ని గుర్తించి, వెలికి తీయడం, ఉత్పత్తి దీని ముఖ్య ఉద్దేశం. అలాగే, ప్రత్యేకంగా సంయుక్త చమురు, గ్యాస్ ఉత్పత్తి జోన్లను కూడా ఏర్పాటు చేస్తారు. దీంతో ఇండియాకు భారీగా మన జలాల నుంచే చమురు లభిస్తుంది. ఫలితంగా చమురు కోసం విదేశాలపై ఆధారపడే అవకాశం తగ్గుతుంది. విదేశాలకు భారత నిధుల్ని వెచ్చించే అవకాశం కూడా తగ్గుతుంది.

కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం.. 'సముద్ర మంథన్' పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురు నిక్షేపాల్ని వెలికితీస్తారు. దీంతో మనకు చమురు భారీగా లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. ప్రభుత్వం చేపట్టిన ఆత్మ నిర్భర భారత్ లక్ష్యం కూడా నెరవేరుతుందని కేంద్రం చెబుతోంది. భారత చమురు ఉత్పత్తి రంగానికి ఇది ఎంతో మేలు చేస్తుందని కేంద్రం భావిస్తోంది.

# రామమందిరం విరాళాల చోరీపై.. ప్రతిపక్ష ఎంపీల వినూత్న నిరసన




**న్యూఢిల్లీ:** అయోధ్యలోని రామమందిరంలో విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు వినూత్నంగా నిరసన తెలిపారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో ఒక వీధి నాటకాన్ని ప్రదర్శించారు. బీహార్‌లోని పూర్ణియా కాంగ్రెస్ ఎంపీ పప్పు యాదవ్ ఒక హిందూ సన్యాసి వేషంలో కనిపించారు. సమాజ్‌వాదీ పార్టీ మహిళా ఎంపీ ఒక భక్తురాలి పాత్రను పోషించారు. ఆ భక్తురాలు గుడి పేరు మీద డబ్బు సమర్పించగా, ఆ సన్యాసి 'దొంగతనం మా రక్తంలోనే ఉంది' అని చెబుతూ ఆ విరాళాన్ని తన జేబులో వేసుకున్నారు.

కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. నిరసన ప్రదేశంలో ఉంచిన విరాళాల పెట్టెలో ప్రతీకాత్మక కానుకగా ఆయన డబ్బులు వేశారు. కొందరు ఎంపీలు కూడా విరాళాలు సమర్పించారు. ఆ తర్వాత యాదవ్ పాత్ర ఎంపీ ఆ విరాళాల పెట్టెను తీసుకుని నడుచుకుంటూ వెళ్ళిపోతారు. అక్కడ గుమిగూడిన ప్రతిపక్ష ఎంపీలు హర్షధ్వానాలు, నవ్వులతో హోరెత్తించారు. కానుకలు, అధికారాన్ని అపహరించారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు నీట్ వివాదంపై సీజేపీ నేతృత్వంలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగంపైనా ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. 'కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు ఎందుకు రావడం లేదు? ఈ ఆదేశం ఎవరు ఇచ్చారు?' అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు.

# వైసీపీని కట్టడి చేసే వ్యూహం..

» రాష్ట్రంలో కేసులు, అరెస్టులు, పరస్పర ఆరోపణలు
» వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బలహీనపర్చడంపైనే ప్రభుత్వం దృష్టి

# టీడీపీకి బూమరాంగ్ అవుతోందా?

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటింది. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, సమర్థమైన పాలన అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత. అయితే ఇటీవల రాష్ట్ర రాజకీయ పరిణామాలను గమనిస్తే, పాలన కంటే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బలహీనపర్చడంపైనే ప్రభుత్వం ఎక్కువ దృష్టి సారిస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల పాలన అనంతరం అభివృద్ధి, సంక్షేమం, పరిపాలన వంటి అంశాలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి పెడుతుందని చాలామంది ఆశించారు. కానీ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై కేసులు, అరెస్టులు, దాడుల ఆరోపణలు కొనసాగుతుండటంతో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారుతోంది.

## ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు...

ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు వైసీపీ నాయకులు, కార్యకర్తలపై వరుసగా కేసులు నమోదు కావడం, అరెస్టులు జరుగుతుండడం రాజకీయ చర్చకు దారి తీసింది. వీటిని రాజకీయ కక్షసాధింపుగా వైసీపీ అభివర్ణిస్తుండగా, ప్రభుత్వం మాత్రం చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని చెబుతోంది. తాజాగా కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్టు తీవ్ర వివాదానికి దారితీసింది. తెల్లవారుజామున పోలీసులు ఆయన నివాసానికి వెళ్లి అరెస్టు చేసిన తీరు, ఆ సమయంలో జరిగిన పరిణామాలపై వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు రావడంతో పోలీసుల తీరుపై మరిన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, ఎమ్మెల్యేపై అన్యాయంగా హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు చట్టాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తే దాని ప్రభావం భవిష్యత్తులో తప్పదని ఆయన హెచ్చరించారు.




## ఆశించిన ఫలితమే ఇస్తుందా..

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రతిపక్షాన్ని ఒత్తిడికి గురిచేసే ప్రయత్నాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. గతంలో చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత టీడీపీ శ్రేణుల్లో కనిపించిన పోరాటస్ఫూర్తి, ఇప్పుడు వైసీపీ శ్రేణుల్లో కనిపిస్తోందని వారు చెబుతున్నారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు వెనక్కి తగ్గకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనే ధోరణి ప్రదర్శించడం గమనార్హంగా మారింది. ఈ పరిస్థితి అధికార పార్టీ వ్యూహానికి విరుద్ధ ఫలితాలు ఇవ్వొచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షంపై నిరంతరం ఒత్తిడి పెంచడం వల్ల ఆ పార్టీలో భయం కంటే ఐక్యత, పట్టుదల పెరిగే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీంతో అధికార పార్టీ ఆశించిన రాజకీయ లాభం కంటే, ప్రత్యర్థి మరింత బలపడే పరిస్థితి ఏర్పడే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని అంటున్నారు.

## రానున్న రోజుల్లో ఎక్కడికి దారి తీసేనో?

రాష్ట్రంలో కేసులు, అరెస్టులు, పరస్పర ఆరోపణలు పెరుగుతుండటంతో రాజకీయ ఉద్రిక్తత రోజురోజుకూ అధికమవుతోంది. ప్రజలు మాత్రం రాజకీయ ఘర్షణల కంటే అభివృద్ధి, సంక్షేమం, పరిపాలనపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆశిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ రాజకీయ పరిణామాలు ఏ దిశగా సాగుతాయన్నది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.

# నిర్దోషిగా బ్రిజ్‌భూషణ్



**ఢిల్లీ :** మహిళా రెజ్లర్లను లైంగిక వేధించినట్లు ఆరోపణలు వచ్చిన కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ నిర్దోషిగా తేలారు. ఆయనతో పాటు మరో నిందితుడు వినోద్ తోమర్‌ను దిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం నిర్దోషిగా ప్రకటించింది. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడం, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల్లో వ్యత్యాసం కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. 2016-2019 మధ్యకాలంలో తాము లైంగిక వేధింపులు ఎదుర్కొన్నామంటూ 2023లో మహిళా రెజర్లు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చేపట్టడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. నాటి సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్, ఇతర సభ్యులపై వారు ఈ ఆరోపణలు చేశారు. ఈ నిరసనల్లో స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా తదితరులు పాల్గొన్నారు. కేంద్రం జోక్యంతో వారు మధ్యలో నిరసనలు విరమించారు. అయితే తగిన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపిస్తూ ఆరుగురు రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మరోసారి నిరసనలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పార్లమెంట్ కొత్త భవనంవైపు మార్చ్ చేపట్టగా.. వారిని పోలీసులు అడ్డుకోవడం, వారిని ఈడ్చుకెళ్లిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఆరుగురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదు ఆధారంగా బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదైంది. పోలీసులు అభియోగాలు దాఖలు చేశారు. ఆ ఆరుగురిలో వినేశ్ ఫొగాట్ కూడా ఉన్నారు. ఆ విషయాన్ని మూడు నెలల క్రితం ఆమె వెల్లడించారు. లైంగిక వేధింపుల బాధితుల గుర్తింపును పరిరక్షించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంత కాలం తన గుర్తింపును బయటపెట్టలేదని వెల్లడించారు. అంతకుముందు మైనర్ రెజ్లర్ ఒకరు తాను చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవడంతో పోక్సో కేసులో సింగ్ ఇప్పటికే నిర్దోషిగా తేలారు. ఇక నేటి తీర్పుతో ఆయనపై క్రిమినల్ విచారణ ముగిసినట్లయింది. తొలినుంచి బ్రిజ్ భూషణ్ తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. "ఆ ఆరోపణలు నిజమని తేలితే.. నేను ఉరివేసుకుంటానని తొలిరోజే చెప్పాను. నేడు నేను నిర్దోషిగా తేలినందుకు ఎంతోసంతోషంగా ఉంది" అని తీర్పు అనంతరం సింగ్ వ్యాఖ్యానించారు.

# మరో పేపర్ లీక్ ఆందోళనలు ఉద్ధృతం



**ఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ నిరసనలతో కొన్నిరోజుల క్రితం దేశ రాజధాని దిల్లీ ఉద్రిక్తంగా మారగా.. ఇప్పుడు ఝార్ఖండ్‌లో అదే పరిస్థితి కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజధాని నగరం రాంచీలో ప్రారంభమైన ఆందోళనలు ఉద్ధృతంగా మారాయి. నియామక పరీక్షను రద్దు చేయాలని, ఆ ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని, నియామక వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో ఆదివారం జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ ఆందోళనలకు క్రాంతి జనతాపార్టీ మద్దతు ప్రకటించింది.

"జేపీఎస్సీ పరీక్ష ఫలితాలు గతనెల విడుదలయ్యాయి. తర్వాత ముఖ్యమంత్రిని కలిసి, పేపర్ లీక్‌పై ఆధారాలను సమర్పించాం. కొన్నివారాలుగా నిరసనలు జరుగుతున్నా.. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం, జేపీఎస్సీ తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దాంతో విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతున్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు, మా పోరాటాన్ని ఉద్ధృతం చేసేందుకు నిరాహార దీక్ష ప్రారంభిస్తున్నాను. నిందితులకు శిక్ష పడటమే మా ప్రధాన లక్ష్యం" అని స్టేడియంలోని ఆందోళనకారులను ఉద్దేశించి మహతో మాట్లాడారు. పేపర్ లీక్ ఆరోపణలు, నియామక ప్రక్రియలో అవకతవకలు, పాలనాపరమైన లోపాలతో తమ కెరీర్‌కు తీవ్రనష్టం వాటిల్లుతోందంటూ ఆ రాష్ట్రంలోని విద్యార్థులు కొన్ని వారాల క్రితం నిరసనలు ప్రారంభించారు. "జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలకు సంబంధించి ఓఎంఆర్ షీట్ వైరల్ అయిన తర్వాతే ప్రభుత్వం స్పందించింది" అని ఆందోళనకారులు విమర్శించారు. ఈ పరీక్షల విషయంలో సంస్థాగత మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. వీరికి సీజేపీ మద్దతు ప్రకటించింది. "నిరసనకారులతో మాట్లాడాం. వారికి మేం అండగా ఉంటాం. వారి డిమాండ్లకు మా మద్దతు ఉంటుంది" అని అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా వెల్లడించారు.



# పాదచారులు నడించేందుకు దారివ్వండి

**ఢిల్లీ :** పాదచారులకు రోడ్లపై నడవడానికి సరైన మార్గం లేకపోవడంవల్ల ప్రమాదాలు జరుగుతుండటంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రహదారులు ఉన్న ప్రతిచోట పాదచారుల కోసం ఆక్రమణలు లేని స్థలాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పాదచారులు నడిచే మార్గం మోటార్ వాహనాలు ప్రయాణించే మార్గానికి విడిగా ఉండాలని పేర్కొంది. విడిగా మార్గాన్ని ఏర్పాటు చేయడానికి వీలుకాని ప్రదేశాల్లో రోడ్లకు, ప్రజలు నడిచే ప్రదేశానికి మధ్య తాడు అయినా కట్టాలని సూచించింది. రహదారుల పక్కన ఉండే ఖాళీ స్థలం తమ కోసమేనని, వాహనాల బెడద లేకుండా స్వేచ్ఛగా నడవగలమని పాదచారులకు నమ్మకం కలిగించాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఇందుకు రెండు వారాల గడువు ఇచ్చింది. అనంతరం పాదచారుల కోసం చేసిన ఏర్పాట్లపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది. విషయాన్ని తదుపరి విచారణ కోసం రెండు వారాలకు వాయిదా వేసింది. ఫుట్‌పాత్‌లపై నడవడం కూడా ప్రజల ప్రాథమిక హక్కులలో భాగమని పేర్కొన్నది.

# మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం చారిత్రాత్మకం

## ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

**విశాఖపట్నం :** ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి మైలురాయిగా నిలిచే భోగాపురం అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం చారిత్రాత్మక ఘట్టమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల బిజీ షెడ్యూల్ మధ్య కూడా సమయం కేటాయించి, దాదాపు మూడు లక్షల మంది ప్రజల సమక్షంలో విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీకి ఎన్డీఏ కూటమి, తెలుగు ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువు కంటే ముందే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం చారిత్రాత్మక విజయమన్నారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాయుడే నేడు ప్రారంభోత్సవం జరిగేలా కృషి చేశారని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో పాటు ఉత్తరాంధ్రలో ఐటీ హబ్, గూగుల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి పెట్టుబడులు రావడం ప్రాంత అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. 13 వేల మంది గిరిజన బాలికలతో నిర్వహించిన ధింసా నృత్య ప్రదర్శన గిన్నిస్ రికార్డు సాధించడం పట్ల ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి, వలస వెళ్లిన ఉత్తరాంధ్ర యువత తిరిగి సొంత ప్రాంతంలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందే పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీరును ఎంపీ తీవ్రంగా విమర్శించారు. భోగాపురం విమానాశ్రయ భూసేకరణను తగ్గించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దేశ ప్రధానమంత్రి పాల్గొన్న కార్యక్రమం జరుగుతున్న సమయంలో రోడ్‌షోలతో యంత్రాంగానికి అంతరాయం కలిగించే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించకుండా అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సింహాచలం శ్రీ



వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ప్రసాదాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఉత్తరాంధ్రతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పష్టం చేశారు.

# దగా డిఎస్సీపై వైఎస్సార్సీపి గర్జన



**విజయనగరం :** మెగా డిఎస్సీని దగా డిఎస్సీగా మార్చారని ఆరోపిస్తూ వైఎస్సార్సీపి రోడ్డెక్కింది. విద్యా, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఈ ఆందోళన కొనసాగింది. పార్టీ పిలుపునందుకున్నవందలాది మంది ఈ కార్యక్రమంలో భాగస్థులను చేసింది. సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం స్పందించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. తొలుత విజయగరంలో జెడ్పీ చైర్ పర్సన్, వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు నేతృత్వంలో యువ నాయకత్వం కదం తొక్కింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించింది. యువజీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రభుత్వాల తీరు మీద ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. విద్యార్థుల జీవితాలతో వ్యాపారం చేయడానికి సిద్ధపడడం మీద గొంతెత్తింది. పిల్లలు ఆత్మహత్య చేసుకుంటున్నా పట్టించుకోని ఏలికలు మీద దుమ్మెత్తి పోసింది. క్రీడా కోటాలో ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకోవడం ఏమిటని నిలదీసింది. నగర నడి వీధుల్లో యువతరం ప్రభుత్వ నిర్లక్ష్యం మీద గర్జించింది. కదంతొక్కిన యువజనాన్ని ఉద్దేశించి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే మెగా డిఎస్సీని ప్రకటిస్తామని బీరాలు పలికిన కూటమి నాయకులు, దానిని దగా డిఎస్సీగా మార్చారని అన్నారు. టెట్ పరీక్షలు రాయని, కనీసం రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించే వారికి కాకుండా కేవలం పోటీలలో పాల్గొన్న వారికి ఉపాధ్యాయ ఉద్యోగులకి క్రీడా కోటా కింద ఎంపిక చేయడం ఏ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయో స్పష్టమయ్యిందన్నారు. అంతేకాకుండా ఇడబ్ల్యూసి కోటాలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు తలెత్తుతున్నాయన్నారు. పరీక్షా పత్రం అప్ లోడ్ చేసిన వ్యక్తులకే టాప్ ర్యాంకర్లు చేసినా ప్రభుత్వానికి ఏమీ పట్టకపోవడం దారుణమన్నారు. అది ఏ స్థాయిలో ఆ పేపర్ లీక్ అయ్యిందో కూడా విచారణకు ఆదేశించే తీరిక ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. వాస్తవాలను తమ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆధారాలతో సహా వెలుగులోకి తీసుకుని వచ్చిన తరువాత కూడా ఈ కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేకపోవడం విషాదకరమన్నారు. డిఎస్సీని నిరుద్యోగ ఉపాధ్యాయుల పాలిట దగా డిఎస్సీగా మార్చారని అన్నారు. వాస్తవానికి, నిర్వహించిన డిఎస్సీ సక్రమంగా జరిగింది అని ప్రభుత్వం భావిస్తే, విచారణకు ఎందుకు వెనకాడు తోందన్నారు. తాము ఈ వ్యవహారం మీద వెనకడుగు వేయమని స్పష్టం చేశారు. బాధిత అభ్యర్థుల కోసం న్యాయపోరాటానికి కూడా తమ పార్టీ సిద్ధపడిందన్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం సిబిఐతో గానీ, సిట్టింగ్ జడ్జితో గాని విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసంచేసిందన్నారు. తల్లికి వందనాన్ని కూడా ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ, రెండున్నరేళ్ల గడిచిన తరువాత వైఎస్సార్సీపి ఆందోళన ఫలితంగా నిధులు విడుదల చేసిందన్నారు.

## ఎక్కడా ఏకగ్రీవం కాకుండా పోటీలో ఉందాం

**గుడివాడ:** ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ హామీ.. సూపర్ సున్నా అయ్యిందని మాజీ మంత్రి కొడాలి నాని విమర్శించారు. రెండేళ్లలో ఒక్క కొత్త పెన్షన్ కూడా ఇవ్వలేని ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు కొడాలి నాని. సాగునీరు, రైతాంగం సమస్యలు, వైఎస్సార్‌సీపీపై అక్రమ కేసులు తదితర అంశాలపై కొడాలి నాని స్పందించారు. ' స్థానిక ఎన్నికలు వస్తున్నాయి.. ఎవరూ భయపడొద్దు. కేసులు పెట్టి జైలుకు పంపినా బెదరొద్దు. ఎక్కడా ఏకగ్రీవం కాకుండా పోటీలో ఉందాం. బాబు, పవన్, బీజేపీ మోసాలను ఎండగడదాం' అని పేర్కొన్నారు. రైతాంగం నీళ్ల లేక తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. ప్రాజెక్టుల్లో నీళ్లుంచుకుని కూడా రైతులకు నీరివ్వడం లేదు. పైనుంచి చెబితే తప్ప నీరివ్వలేమని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది వరకూ తాగునీటికి నీరు కావాలి అందుకే ఇవ్వలేమంటున్నారు. పంటలన్నీ ఎండిపోయి అంతా నాశనమైపోయాక ..నీళ్లు సముద్రంలోకి వదులుతారా?, రైతాంగాన్ని అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఎరువుల కోసం రైతులకు ఓటీపీలు పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. ఆక్వా రైతులు , సామాన్య ప్రజలు , రాజకీయ పార్టీల్లో ఉన్న నాయకులను ఇబ్బంది పెడుతున్నారు ' అని పేర్కొన్నారు.

## గడ్కరీ ఫేక్ వీడియోలు తొలగించండి

**న్యూఢిల్లీ:** ఈ20 పెట్రోల్ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని లక్ష్యంగా చేసుకుని పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెట్టడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రమంత్రిని, ఆయన కుటుంబాన్ని ఇంధన వివాదంతో ముడిపెడుతున్న ఏఐ వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించాలని మెటా, గూగుల్ సహా పలు ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. అది అత్యంత నీచమైన కంటెంట్ అని మండిపడింది. ఆన్‌లైన్‌లో ఇటువంటి పోస్టులకు చోటు ఉండకూడదని పేర్కొంది.

బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండానే.. ఇటువంటి నకిలీ పోస్టులను తొలగించడానికి ఏదైనా యంత్రాంగం ఉందా? అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రశ్నించింది. విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు.. తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకునే యంత్రాంగం మాత్రం ఎందుకు లేదని కోర్టు నిలదీసింది. వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించింది. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గడ్కరీ ఇటీవల తెలిపారు. దీనిపై ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు పెడుతున్నారని పేర్కొంటూ.. ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తన పరువుకు భంగం కలిగించినందుకు గానూ రూ.11కోట్ల నష్టపరిహారం కోరారు. ఇథనాల్-బ్లెండింగ్ కార్యక్రమం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని.. ఇందులో తనకు వ్యక్తిగతంగా ఎటువంటి సంబంధం లేదని గడ్కరీ స్పష్టం చేశారు.

## రైతుల కోసం పోరాటం ఆగదు...

**దేవరపల్లి** : రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని ప్రభుత్వం వెన్నుపోటు రాజకీయాలకు ప్రతీకగా మారిందని, గత 27 నెలల పాలనలో రైతులకు గిట్టుబాటు ధర, భరోసా, ప్రభుత్వ అండ ఏదీ దక్కలేదని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పొగాకు యార్డును సందర్శించి రైతులతో ముఖాముఖి అయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 67 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ, ఏ పంటకూ గిట్టుబాటు ధర లేని దుస్థితిని చంద్రబాబు ప్రభుత్వం సృష్టించిందన్నారు. పొగాకు రైతుల నుంచి వరి, పత్తి, కొబ్బరి, మిర్చి, ఉల్లి, టమాటా వరకు అన్ని పంటల రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 67 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి రాష్ట్రంలో గత 27 నెలలుగా ఒక్క రైతుకైనా, ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర దక్కలేదు. వరి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి, మినుములు, పెసర్లు, సజ్జలు, మిర్చి, పొగాకు, ఉల్లి, టమాటా, కోకో, చెరకు... ఏ పంటను తీసుకున్నా రైతు నష్టాల్లోనే ఉన్నాడు. వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిపోయింది. రైతు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు, వేధింపులతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. రైతుకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది.

వైయస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023--24లో పొగాకు సగటు ధర కిలోకు రూ.289 ఉండేది. గరిష్ట ధర రూ.411 వరకు నమోదైంది. కానీ ఈరోజు అదే సగటు ధర రూ.214కు పడిపోయింది. ఉత్తరాది ప్రాంతంలో రూ.326 ఉన్న ధర ఇప్పుడు రూ.236కు క్షీణించింది. ఇవి నా లెక్కలు కాదు... భారత ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసిన అధికారిక గణాంకాలు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా రైతుకు వచ్చే ఆదాయం మాత్రం భారీగా తగ్గిపోయింది. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే.

టొబాకో బోర్డు 142 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేస్తామని రైతులకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు కొనుగోలు చేసింది కేవలం 47.3 మిలియన్ కిలోలు మాత్రమే. రాష్ట్రంలో 232 మిలియన్ కిలోల ఉత్పత్తిలో కేవలం 21 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. ఉత్తరాది ప్రాంతంలో 83 మిలియన్ కిలోల ఉత్పత్తి కాగా 105 రోజుల వేలంలో కొనుగోలు చేసింది కేవలం 10 మిలియన్ కిలోలే. రైతుల వద్ద ఇంకా పెద్ద మొత్తంలో పొగాకు నిల్వలు ఉన్నాయి. వేలాల్లో 'నో బిడ్స్' పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, 30 నుంచి 40 శాతం వరకు రిజెక్ట్ చేస్తున్నారు. కొనుగోలు వ్యవస్థ వెనుక దళారుల సిండికేట్ పనిచేస్తోందని రైతులే చెబుతున్నారు. అయినా ప్రభుత్వం ఒక్క కొనుగోలుదారునిపై కూడా చర్య తీసుకోలేదు. మార్క్‌ఫెడ్‌ను పోటీ కొనుగోలుదారుగా మార్కెట్‌లోకి తీసుకురాకపోవడంతో కంపెనీలు రైతులను దోచుకుంటున్నాయి. పైగా కంపెనీలకు కిలోకు రూ.20 సబ్సిడీ ఇస్తూ రైతుకు మరింత నష్టం చేస్తున్నారు. రైతును కాపాడాలంటే వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి, ప్రతి గ్రేడ్‌కు కనీస మద్దతు ధర ప్రకటించి, మార్కెట్‌లో పోటీ వాతావరణం తీసుకురావాలి.

మా ప్రభుత్వం హయాంలో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతులకు ప్రతి గ్రేడ్‌కు కనీస ధర లభించింది. రూ.3,000 కోట్ల ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ఐదేళ్లలో రూ.7,800 కోట్ల విలువైన పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం. 84 లక్షల 66 వేల మంది రైతులకు రూ.2,050 కోట్ల మేర సున్నా వడ్డీ ప్రయోజనం అందించాం. రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ ప్రయోగశాలల ద్వారా రైతుకు అండగా నిలిచాం. రైతు ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారీ ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని ఆదుకుంది.

## పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడెమీకి నేడు మళ్లీ భూమి పూజ

**విశాఖపట్నం:** పాత ప్రాజెక్టులకే కొత్త రంగులేసి, వాటిని తామే తెచ్చి నట్లుగా కలరింగ్ ఇచ్చే సీఎం నారా చంద్రబాబు, ఆయన కుమారుడైన మంత్రి నారా లోకేశ్ క్రెడిట్ పిచ్చి పీక్స్‌కు చేరుతోంది. రంగం ఏదైనా.. ప్రాజెక్టు ఎలాంటిదైనా.. క్రెడిట్ కొట్టేస్తాం.. ఎన్నిసార్లైనా భూమిపూజ చేసేస్తాం.. ఎలాంటి మొహమాటం లేదు.. అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు తండ్రీ కొడుకులు. నాలుగు రోజుల క్రితం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభించి.. క్రెడిట్ చోరీ కోసం చంద్రబాబు రూ.కోట్లు ఖర్చు చెయ్యగా.. తానేం తక్కువ తినలేదంటూ అదే విశాఖ వేదికగా.. మరో క్రెడిట్ చోరీకి నారా లోకేశ్ సిద్ధమవుతున్నారు.

ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ హయాంలో భూ కేటాయింపులు జరిగిన పీవీ సింధు బ్యాడ్మింటన్ అకాడెమీకి రెండేళ్ల క్రితం భూమి పూజ జరిగి, నిర్మాణమూ మొదలైంది. ఇప్పుడు.. ఆ భూమి పూజ చెల్లదంటూ లోకేశ్ బుదవారం మరోమారు భూమిపూజకు ఏర్పాట్లు చేశారు. తద్వారా ఈ అకాడెమీని తామే తెచ్చినట్లు క్రెడిట్ కోసం పాకులాడుతున్నారు. ఆ కథాకమామీషు ఇదీ..

**2021లో వైఎస్ జగన్ హయాంలోనే స్థలం కేటాయింపు..**

బ్యాడ్మింటన్‌లో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచి అంతర్జాతీయ వేదికపై భారత కీర్తి పతాకను ఎగురవేసిన క్రీడాకారిణి పీవీ సింధును ప్రోత్సహించేందుకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖలో బ్యాడ్మింటన్ అకాడెమీ ఏర్పాటుకు హామీ ఇచ్చి ంది. ఆ హామీకి కట్టుబడి 2021లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ తోటగరువులో అత్యంత విలువైన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఆ తర్వాత అకాడెమీ విస్తరణకు మరికొంత భూమి అవసరమని సింధు అభ్యర్థించడంతో.. మరో ఎకరాన్ని అదనంగా ఇచ్చారు.

ఇలా మొత్తం 3 ఎకరాల భూమిలో ప్రాజెక్టుకు అంకురార్పణ చేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వమే. అయితే, అకాడెమీ నిర్మాణానికి కొంత ఆలస్యం కావడంతో ఆ స్థలాన్ని జూనియర్ కాలేజీకి ఇవ్వాలంటూ టీడీపీ నేతలు ఓ డిమాండ్ తెచ్చి , అకాడెమీకి



మోకాలడ్డే ప్రయత్నం చేశారు. 2024 నవంబర్ 7న పీవీ సింధు తన తల్లిదండ్రులతో కలిసి 'సెంటర్ ఫర్ బ్యాడ్మింటన్ అండ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' పేరుతో బ్యాడ్మింటన్ అకాడెమీ నిర్మాణానికి ఆ స్థలంలో శ్ష?రస్తోక్తంగా భూమి పూజ చేశారు.

**క్రెడిట్ కోసమే లోకేశ్ ఆరాటం?**

ఈ బ్యాడ్మింటన్ అకాడెమీ నిర్మాణం కూడా చురుగ్గా సాగుతోంది. కానీ.. ఇప్పుడు కేవలం క్రెడిట్ కోసం చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన ఏర్పాట్లు చేయడంపై క్రీడా వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బ్యాడ్మింటన్ అకాడెమీ పూర్తయితే వైఎస్ జగన్‌కే పూర్తి క్రెడిట్ వెళుతుందన్న అక్కసుతోనే మంత్రి లోకేశ్ బుధవారం హడావుడిగా మరోసారి భూమిపూజ చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

గతంలో స్థలాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నించిన చంద్రబాబు పార్టీ.. ఇప్పుడు క్రెడిట్ కోసం.. అదే స్థలంలో హడావుడి చెయ్యడం హాస్యాస్పదమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకోసం రూ.లక్షలు ఖర్చు చేసి పార్టీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా.. భూమి పూజకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ జీవీఎంసీ, అధికారులు ఏర్పాట్లు చేస్తుండటం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు.

## ఏపీ మత్స్యరంగానికి రూ.2,329 కోట్ల ప్రాజెక్టులు

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో మత్స్యరంగ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,328.89 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ చెప్పారు. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యొజున (పీఎంఎంఎస్‌వై) కింద రాష్ట్రానికి రూ॥681.38 కోట్ల కేంద్ర వాటా మంజూరు చేయుగా, ఇప్పటికే రూ.462.56 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు.

ఈ నిధులతో నాలుగు ఫిషింగ్ హార్బర్లు, విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, ఆరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల అభివృద్ధి చేపట్టినట్లు వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు హయాంలో 2019--23 మధ్య 15 ప్రాజెక్టులు ఆమోదం పొందడం విశేషం. వీటిలో ఏడు ప్రాజెక్టులకు ప్రస్తుతం ప్రభుత్వం షెడ్యూల్ రేట్స్‌ను పరిశీలిస్తుండగా, రెండు ప్రాజెక్టులు వర్క్ ప్రాసెస్‌లో ఉన్నట్లు కేంద్రమంత్రి చెప్పారు. మొత్తం వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యరంగంలో పరుగులు పెట్టిందనేది కేంద్రప్రభుత్వ జవాబుతో స్పష్టమవుతోంది.

**97.98 పూర్తయిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్**

సాగర్‌మాల, బ్లూ రివల్యూషన్, ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ పథకాల కింద చేపడుతున్న పలు ప్రాజెక్టుల పురోగతిని కూడా కేంద్రమంత్రి వివరించారు. ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.288.80 కోట్లతో 2019--20లో ఆమోదం లభించగా, ప్రస్తుతం 97.98 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. చివరిదశ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.138.29 కోట్ల వాటాను ఇస్తుండగా, సాగర్‌మాల పథకంతో సమన్వయంగా అమలు జరుగుతోందని తెలిపారు.

రూ.178.51 కోట్లతో చేపట్టిన విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు 53.75 శాతం పూర్తయ్యాయని చెప్పారు. దీన్ని వచ్చే మార్చి 31 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 400 మెకనైజ్డ్ బోట్ల సామర్థ్యం ఉన్న ఈ హార్బర్‌లో ఆధునికీకరణ అనంతరం అంతర్జాతీయ ప్రమాణాలతో చేపల దిగుమతి, నిల్వ, వేలం, కోల్డ్‌చైన్ తదితర సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేలమంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

## కత్తులు దూస్తున్న స్థానిక కురుక్షేత్రం!




**మదనపల్లె** : స్థానిక సంస్థల ఎన్నికల ముచ్చట తెరపైకి రాగానే ఉమ్మడి జిల్లాలోని ఆశావాహుల్లో ఒక్కసారిగా ఉత్సాహం నెలకొంది. టికెట్ ఆశిస్తున్న నేతలు అప్పుడే ముఖ్య నాయకులను, ముఖ్యంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీగా మారిపోయారు. క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేస్తూ.. గ్రామస్థాయిలోని చోటా లీడర్లను ఎలాగైనా తమ వైపు తిప్పుకునేందుకు సామ దాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. ముఖ్యంగా అధికార తెలుగు దేశం పార్టీ నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అప్పుడే శక్తికి మించిన హామీలు గుప్పిస్తున్నారు. వీలైనన్ని చోట్ల బెదిరింపులతోనో, ప్రలోభాలతోనో ఏకగ్రీవాలు చేసుకోవాలని ఇప్పటి నుంచే తెరవెనుక పావులు కదుపుతుండటం గమనార్హం. నోటిఫికేషన్ రాకముందే క్షేత్రస్థాయిలో ఈ రేంజ్ పొలిటికల్ హీట్ ఉంటే, ఇక నోటిఫికేషన్ వెలువడ్డాక ఇంకెంత సందడి నెలకొంటుందోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**కోర్టు మొట్టికాయలతోనే 'స్థానిక' చలనం**

రాష్ట్రంలో అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హఠాత్ ప్రకటన వెనుక అసలు గుట్టు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనల ప్రకారం.. స్థానిక సంస్థల పాలకవర్గాలు రద్దు కాగానే నిర్దిష్ట గడువులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికలకు వెళితే ఘోరమైన ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ముందే ఊహించి, రకరకాల కుంటిసాకులతో ఎన్నికలను ఇన్నాళ్లూ వాయిదా వేయిస్తూ వచ్చింది. అయితే, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) తీవ్రంగా జోక్యం చేసుకుని గడువు విధించడంతో.. ఇప్పుడు కూటమి సర్కారుకు ఎన్నికలకు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

**అసలు అక్టోబర్‌లో ఎన్నికలు సాధ్యమేనా?**

స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఓవైపు చెబుతున్నప్పటికీ.. ఆచరణలో అది ఇప్పట్లో సాధ్యం కాదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు నిర్వహించాలంటే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారు కావాల్సి ఉంది. దీనికి తోడు ఓటర్ల జాబితాకు ఇంకా తుది రూపమే రాలేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ముసాయిదా జాబితాను గత నెల 31న విడుదల చేశారు. ఈ ప్రక్రియ ప్రకారం రాబోయే అక్టోబరు 3 న మాత్రమే ఓటర్ల తుది జాబితా వెలు వడనుంది. ఆ తర్వాతే పంచాయతీల వారీగా ఓటర్ల సంఖ్యను విడదీసి తేల్చాల్సి ఉంటుంది. అంతవరకు అసలు నోటిఫికేషన్ ఇచ్చేందుకే వీలుపడదు.

**సాంకేతిక అవరోధాల నడుమ చంద్రబాబు 'స్థానిక' రాజకీయం**

రాష్ట్రంలో అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్తున్న మాటలు ఆచరణలో సాధ్యం కాదని రాజకీయ విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు. ఎన్నికల నిర్వహణకు ముందు పూర్తి కావాల్సిన మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ ఇంకా ఎక్కడికక్కడే నిలిచిపోయింది. మరోవైపు వచ్చే సెప్టెంబరులో మండల పరిషత్‌ల పదవీ కాలం ముగియనుంది. ఆ తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్ష పదవులకు రిజర్వేషన్లు తేల్చాల్సి ఉంది. ఇవన్నీ కాకుండా ఓట్ల సవరణ (సర్) ప్రక్రియ కూడా ఇంకా పూర్తి కాలేదు. పంచాయతీల కాలపరిమితి ఎప్పుడో ముగిసినప్పటికీ, ఓట్ల జాబితా తేలకుండా ఎన్నికల సంఘం అనుమతితో ప్రక్రియ చేపట్టడం కూడా అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో, అక్టోబరులో ఎన్నికలు జరగడం అసాధ్యమనే స్పష్టత వస్తోంది.

**ఇదంతా కేవలం 'క్యాడర్' కోసమే?**

చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఎప్పుడూ స్థానిక సంస్థల ఎన్నికలను సకాలంలో నిర్వహించిన దాఖలాలు లేవని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఇన్ని సాంకేతిక, న్యాయపరమైన అవరోధాలు అడ్డుగా ఉన్నాయని తెలిసి కూడా.. 'అక్టోబరులో ఎన్నికలు' అంటూ ఆయన పదేపదే హడావుడి చేయడం వెనుక అసలు రహస్యం వేరే ఉందనే చర్చ తమ్ముళ్లలోనే నడుస్తోంది. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక తీవ్ర అసంతృప్తితో ఉన్న తమ పార్టీ క్యాడర్‌లో ఎలాగైనా పొలిటికల్ జోష్ నింపేందుకే బాబుగారు ఈ ఎన్నికల పల్లవి అందుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ప్రాథమిక కసరత్తు కూడా మొదలు పెట్టకుండా, కేవలం బహిరంగ ప్రకటనల ద్వారా పార్టీ శ్రేణులను మభ్యపెట్టేందుకే కూటమి సర్కార్ ఈ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపిందని రాజకీయ వర్గాలు నిప్పులు చెరుగుతున్నాయి.

**కరువు కోరల్లో సీమ.. తుఫాన్ల ముప్పు..**

ప్రస్తుతం ఎన్నికలకు వెళితే అధికార తెలుగుదేశం కూటమికి తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఎల్‌నినో ప్రభావం వల్ల జిల్లావ్యాప్తంగా తాగునీటికి కటకటలాడాల్సిన దారుణమైన పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో ఎక్కడా పంటలు సాగు కాక రైతాంగం అల్లాడుతోంది. శ్రీశైలంలో సరిపడా నీరు ఉన్నప్పటికీ సీమ తాగునీటి అవసరాలకు సైతం విడుదల చేయని దుస్థితి నెలకొంది. పాలకుల నిర్లక్ష్యంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వెల్లువెత్తుతోంది. మరోవైపు అక్టోబరు నెలలో ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి అంటున్నా.. ఆ సమయంలో రాష్ట్రంలో తుఫాన్ల ప్రభావం అత్యంత అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ సాంకేతిక, ప్రకృతి అవరోధాల నేపథ్యంలో ఈ ఏడాదిలో స్థానిక ఎన్నికలు జరగడం అసాధ్యమని, ఇవన్నీ జనాన్ని నమ్మించడానికి ఆడుతున్న డ్రామాలేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఓట్ల తొలగింపు జాబితా రాజకీయ పార్టీలకు ఇవ్వాలి

**అమరావతి** : రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ తర్వాత ఓట్లు తొలగించేం దుకు సిద్ధం చేసిన జాబితాతోపాటు అన్‌మ్యాప్డ్, నాట్ ట్రేస్డ్ ఓటర్ల జాబితాలను పోలింగ్ బూత్‌ల వారీగా అన్ని రాజకీయ పార్టీలకు ఇవ్వాలని మాజీ మంత్రి, వైయస్‌ఆర్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని ఎన్నికల సంఘాన్ని కోరారు. తొందరపడి అర్హుల ఓట్లు తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై నిర్వహించిన సమావేశం లో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి పాల్గొన్న పేర్ని నాని, వైయస్‌ఆర్‌సీపీ తరఫున ప్రస్తావించిన అంశాలను మీడియాకు వివరించారు. భర్త ఓటు ఒక పోలింగ్ బూత్‌లో ఉంటే.. భార్య ఓటు వేరే చోట ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో భార్యాభర్తల ఓట్లు ఒక బూత్‌లో పిల్లల ఓట్లు వేరే బూత్‌లో ఉన్నాయి. ఒకే వీధిలో ఉన్నవారి ఓట్లు కూడా వేర్వేరు బూత్‌లలో ఉన్నాయి. అలాంటి లోపాలు సరిది ద్దాలి. కుటుంబ సభ్యులతో పాటూ ఒకే వీధిలో ఉన్నవారి ఓట్లు ఒకే పోలింగ్ బూత్ లో వచ్చేటట్టు చూడాలి. డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతా ల్లో ఉన్న ఓట్లను గుర్తించి తొలగిస్తున్నామని ఎన్నికల అధికారులు చేస్తున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి తేడా ఉంది. 'సర్' ప్రక్రి య పూర్తయిన తర్వాత కూడా ఒకే వ్యక్తికి చిలక లూరిపేట, నరస రావుపేటలో రెండుచోట్లా ఓటుహక్కు ఉంది. ఆధా రాలతో సహ ఎలక్షన్ కమిషన్ అధికారులకు జాబితా అందించాం. మ్యాపింగ్, డ్రాఫ్ట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అనేక లోపాలు ఉన్నాయి.

## అభిజిత్ దీప్కే సంచలన నిర్ణయం

**సత్తెనపల్లి న్యూస్, ఢిల్లీ** : ఊహాగానాలకు కాక్రోచ్ జనతా పార్టీ తెర దించింది. ఆ పార్టీ భవిష్యత్‌పై వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. రాజకీయ పార్టీగా మారే ఆలోచన తమకు లేదని.. ప్రజా సమస్యలపై ఒత్తిడి తీసుకొచ్చే 'ప్రెజర్ గ్రూప్'గానే పనిచేస్తామని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో జరుగుతున్న రెండు రోజుల వ్యూహ సమావేశాల సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

30 ఏళ్ల అభిజిత్ దీప్కే కేవలం రెండు నెలల క్రితమే వ్యంగ్య రూపంలో కాక్రోచ్ జనతా పార్టీని ప్రారంభించారు. తొలుత సోషల్ మీడియా వేదికగా సరదా ఉద్యమంలా కనిపించిన ఈ సంస్థ.. ఆ తర్వాత పరీక్షల అక్రమాలు, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థుల ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారింది. ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా జరిగిన విద్యార్థి ఆందోళనలకు దీప్కే నాయకత్వం వహించారు. ఆ నిరసనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది.

తమ భవిష్యత్ ప్రణాళికలపై దీప్కే మాట్లాడుతూ.. "రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే ఆలోచన ప్రస్తుతం లేదు. మీడియాకే ఆ అంశంపై ఆసక్తి ఎక్కువగా ఉంది. మేము ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తాం" అని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలు, పరీక్షల నిర్వహణలో అక్రమాల వంటి అంశాలపై పోరాడడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించే దిశగా వ్యూహాలు రూపొందిస్తున్నట్లు దీప్కే తెలిపారు. యువత అభిప్రాయాలను తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా 'లిజనింగ్ టూర్' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. "దేశంలోని ఏ ప్రాంతంలో విద్యార్థులు సమస్యలపై పోరాడినా.. వారికి అండగా ఉంటాం" అని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం జార్ఖండ్‌లో జేపీఎస్సీ సివిల్స్ పరీక్షల్లో అక్రమాల ఆరోపణలపై కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి మద్దతు ఇచ్చే అంశాన్ని కూడా సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. అవసరమైతే అక్కడికి వెళ్లి మద్దతు ఇస్తామని చెప్పారు. జంతర్ మంతర్ ఆందోళన సమయంలో 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ తమ ఉద్యమానికి మార్గదర్శకుడిగా ఉన్నారని దీప్కే పేర్కొన్నారు. జార్ఖండ్ విద్యార్థి నేతలతో వాంగ్‌చుక్ ఇప్పటికే మాట్లాడి సంఘీభావం ప్రకటించిన విషయం తెలిసిందే.

సీజేపీ వ్యూహ సమావేశంలో సంస్థ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, దాదాపు 50 మంది కీలక వాలంటీర్లు పాల్గొన్నారు. యువత సమస్యలను ఒక వేదికపైకి తీసుకురావడం, వాటిపై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని వారు తెలిపారు. "యువత ఒక్కటైతే ఏదైనా సాధించగలరని ఈ ఉద్యమం నిరూపించింది" అని జట్టు ప్రతినిధి సౌరవ్ దాస్ వ్యాఖ్యానించారు.

కేవలం వ్యంగ్య వేదికగా మొదలైన కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు యువత సమస్యలపై జాతీయ స్థాయి ఉద్యమ వేదికగా మారే ప్రయత్నం చేస్తోంది. అయితే ఎన్నికల రాజకీయాల్లోకి కాకుండా.. ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే శక్తిగా కొనసాగాలని అభిజిత్ దీప్కే ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.

## ఆర్టికల్ 370 రద్దుకు ఏడేళ్లు.. ప్రధాని మోదీ భావోద్వేగ సందేశం

**న్యూఢిల్లీ:** జమ్ము కశ్మీర్, లడఖ్‌ల ప్రయాణంలో ఆర్టికల్ 370 రద్దు ఒక 'నిర్ణాయక నూతన అధ్యాయం' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఆర్టికల్ 370 రద్దుకు ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయన ఈ చారిత్రక నిర్ణయాన్ని గుర్తు చేసుకున్నారు. 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్ము కశ్మీర్‌ను జాతీయ ప్రధాన స్రవంతిలో పూర్తిగా విలీనం చేసింది. ఈ ప్రత్యేక హోదా రద్దు ద్వారా దశాబ్దాలుగా ప్రాథమిక రాజ్యాంగ హక్కులకు దూరంగా ఉన్న మహిళలు, అట్టడుగు వర్గాలకు సాధికారత లభించిందని ప్రధాని పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, ఏడేళ్ల కిందట ఇదే రోజున ఆర్టికల్ 370, 35(ఏ) చరిత్రలో కలిసిపోయాయని, నాటి నుంచి జమ్ము కశ్మీర్, లడఖ్ ప్రజల జీవితాల్లో సమూల మార్పులు వచ్చాయని అన్నారు. మౌలిక వసతులు విస్తరించడంతోపాటు విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో, క్రీడల్లో నూతన అవకాశాలు మెరుగయ్యాయని చెప్పారు. నేడు దేశం డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని జరుపుకుంటున్న సందర్భంలో ఈ ఆగస్టు 5వ తేదీకి మరింత ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియా డారు. జమ్ము కశ్మీర్, లడఖ్ ప్రాంతాల సర్వతోముఖా భివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు.

## వధువుకు బంగారం.. విద్యార్థులకు సైకిల్ విత్ హెల్మెట్ : విజయ్ బడ్జెట్ ఇది



**సత్తెనపల్లి న్యూస్, ఢిల్లీ** : తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది.

ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టమ్'ను టీవీకే ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు కేటాయించారు.

2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు.

రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు కేటాయించారు.

'పుతియా పయనం-పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లు ఇవ్వనున్నారు.

కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువత కు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్‌లో ప్రకటన రాలేదు.

# డీఎస్సీ అక్రమాలపై రణభేరి

**సత్తెనపల్లి న్యూస్, అమరావతి** : డీఎస్సీ-2025 నియామకాల్లో అవకతవకలు, పేపర్ లీకేజీ వ్యవహారాలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపట్టింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన దీక్షలను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దించింది కూటమి ప్రభుత్వం. అయినప్పటికీ పలు జిల్లాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి..

**అనంతపురం జిల్లాలో..** మెగా డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ దీక్షల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

**శ్రీ సత్యసాయి జిల్లాలో..** డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మవరంలో వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన దీక్షల్లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

**ఎన్టీఆర్ జిల్లాలో జెన్‌జీ నిరసనలు..** తిరువూరు నియోజకవర్గ కేంద్రం బోసుబొమ్మ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏపీ జెన్-జెడ్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, పార్టీ నేతలు దీక్షలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాస్ పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని, స్పోర్ట్స్ కోటాలో అర్హత లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి అందించాలని డిమాండ్ చేశారు.

**వైఎస్సార్ జిల్లాలో..** 2025లో జరిగిన డీఎస్సీ అక్రమాలపై జమ్మలమడుగులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మైలవరం మండలానికి చెందిన విద్యార్థులు దీక్షలో పాల్గొనగా, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు.

**నంద్యాల జిల్లాలో..** ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్ష చేపట్టింది. దీక్షలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలు, అమలు కాని నిరుద్యోగ భృతి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని శిల్పా చక్రపాణిరెడ్డి డిమాండ్ చేశారు.

**నెల్లూరు జిల్లాలో..** కోవూరులో వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి రాష్ట్ర పీఏసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు రజిత్‌రెడ్డి దీక్షలో కూర్చున్నారు. మెగా డీఎస్సీ స్కాంపై సీబీఐ విచారణ జరిపించాలని, డీఎస్సీ లీకేజీ వ్యవహారంలో మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




నిరుద్యోగ భృతి వెంటనే అందించాలని కోరారు.

**తిరుపతిలో భూమన నేతృత్వంలో దీక్షలు..** మెగా డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలో వైఎస్సార్‌సీపీ రిలే నిరాహార దీక్షలు చేపట్టింది. పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన దీక్షల్లో నిరుద్యోగులు, పార్టీ యువజన, విద్యార్థి విభాగాల నాయకులు పాల్గొన్నారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో సహా వెల్లడించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా యువత రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారని, డీఎస్సీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**మాచర్లలో దీక్షకు అడ్డంకులు..** పల్నాడు జిల్లా మాచర్లలో డీఎస్సీ అక్రమాలపై నిరసనగా దీక్ష చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన సొంత స్థలం వద్ద శిబిరం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అక్కడికి చేరుకుని ఏర్పాట్లను అడ్డుకున్నారు. "మా సొంత స్థలంలో దీక్ష చేసుకుంటాం.. దానికి కూడా అనుమతి లేదా?" అంటూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పోలీసులను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నప్పుడు తమ దీక్షను మాత్రమే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు.

**గుంటూరులో టెంట్ తొలగింపు..** గుంటూరు జిల్లాలోనూ డీఎస్సీ వ్యవహారంపై నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ నేతలు సిద్ధమయ్యారు. పొన్నూరులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారని ఆ పార్టీ నేతలు తెలిపారు. శిబిరానికి వేసిన టెంట్‌ను పోలీసులు తొలగించారని మండిపడ్డారు.

**కనిగిరిలోనూ ఉద్రిక్తత..** మార్కాపురం జిల్లా కనిగిరిలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఏర్పాటు చేసిన రిలే దీక్ష శిబిరాన్ని పోలీసులు తొలగించారు. పట్టణంలో సాధారణంగా ధర్నాలు నిర్వహించే ప్రదేశంలోనే టెంట్ ఏర్పాటు చేశామని, అయినప్పటికీ డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి తొలగించారని పేర్కొన్నారు. డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తున్న జెన్‌జీ విద్యార్థులను అడ్డుకోవడం సరికాదని వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి ధద్దాల నారాయణ యాదవ్ విమర్శించారు.

డీఎస్సీ-2025 నియామకాల్లో పారదర్శకత లేదంటున్న వైఎస్సార్‌సీపీ.. విద్యార్థులు, డీఎస్సీ అభ్యర్థులు, వివిధ సంఘాలతో కలిసి ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించింది. పార్టీ నేతలు ఈ పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ నెల 10న విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించేందుకు కూడా సిద్ధమయ్యారు.

**మరోవైపు..** ఈ నిరసనల నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం అప్రమత్తమై పోలీసులను రంగంలోకి దించడం గమనార్హం. నిరసనలను అణచివేసేందుకు అధికార యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండిపడుతోంది.



# చంద్రబాబు పాలన రైతులకు హానికరం

**తూర్పుగోదావరి జిల్లా:** తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య నష్టపోతున్న పొగాకు రైతులతో స్వయంగా మాట్లాడేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో పర్యటించారు. స్థానిక పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శించిన ఆయన, కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న ఆయన, పొగాకు పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర వివరాలు ఆరా తీశారు. రైతుల సమస్యలు, ఇబ్బందులపై వారితో నేరుగా చర్చించిన శ్రీ వైయస్ జగన్, అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు.

**అన్నింటా విధ్వంసం. ప్రశ్నిస్తే అరెస్టులు:** ఈ 26 నెలల చంద్రబాబునాయుడుగారి పాలనలో ఈరోజు అన్ని వర్గాలు నష్టపోయిన పరిస్థితులు కనిపిస్తాయి. ఈరోజు చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఏం జరుగుతోంది అంటే, విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు.. అన్నింటిలోనూ విధ్వంసమే కనిపిస్తోంది. ఇంకా చంద్రబాబునాయుడుగారి పరిపాలనలో పొద్దుట లేచినప్పటి నుంచి మనకు కనిపించేది ఏమిటి అంటే.. ఎవరైనా అన్యాయం అయిపోయిన పరిస్థితులలో ప్రశ్నిస్తే, అక్రమ కేసులు. అక్రమ అరెస్టులు. ఇవి మాత్రమే చంద్రబాబునాయుడుగారి పరిపాలనలో మనకు కనిపిస్తాయి.

**రైతులు రోడ్డెక్కుతున్నారు:** చంద్రబాబునాయుడుగారి పార్టీ అంటే వెన్నుపోటు పార్టీ. ఈ వెన్నుపోటు పార్టీ వల్ల రాష్ట్రానికి, ప్రజలకు బాధ తప్ప ఇంకేమైనా ఉందా అని అడుగుతున్నారు. రాష్ట్రంలో ఇవాళ వ్యవసాయ రంగాన్ని తీసుకోండి. 67 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్న నేపథ్యంలో 26 నెలలు కనీసం ఏ పంటకైనా కూడా గిట్టుబాటు ధరలు వచ్చాయా అని అడుగుతున్నాను. 26 నెలలుగా వరి, మొక్కజొన్న, అరటి, కొబ్బరి, పత్తి, పెసర్లు, సజ్జలు, మిర్చి, పొగాకు, టమోటా, చీనీ పంటకు కానీ.. చివరకు మామిడి రైతులకు కూడా గిట్టుబాట్యు ధర రాని పరిస్థితి. ఇవాళ ఇక్కడికి వచ్చి నేను పొగాకు రైతుల ఆక్రందనల మధ్య నిలబడి ఉన్నా. ఈ పొగాకు రైతులు సంబంధించిన పంటను తీసుకున్నా, ఇవాళ కనిపిస్తున్నది ఏమిటి అని అంటే సంక్షోభమే. రైతులు ఇవాళ రోడ్డు ఎక్కుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

**ఆత్మహత్య చేసుకున్నా కనీస పరామర్శ లేదు:** నా కళ్ల ఎదుటే జంగారెడ్డిగూడెం సమీపంలోని బుట్టాయిగూడెం మండలానికి చెందిన వెంకటేశ్వరరావుగారి కుటుంబం నిలబడి ఉంది. పది ఎకరాల్లో సాగు చేసి, గిట్టుబాటు ధర రాక, పంటను అమ్ముకోలేక ఆ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య ఈ రోజు నా ఎదుట నిలబడి ఉంది. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి ఒక్క ఎంపీ కానీ, ఒక్క ఎమ్మెల్యే కానీ, ఒక్క మంత్రి కానీ వెళ్లలేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కనీసం పరామర్శ కూడా చేయని ప్రభుత్వం ఇది.

2023-24లో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలు కలిపి పొగాకు సగటు ధర కిలోకు రూ.289 లభించింది. అత్యధిక ధర కిలోకు రూ.411 వరకు నమోదైంది. ఇవి నేను చెబుతున్న లెక్కలు కావు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) 2025, జనవరి 1న అధికారికంగా విడుదల చేసిన గణాంకాలు ఇవి.

ఇప్పుడు పరిస్థితి ఏమిటని చూస్తే.. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలు కలిపి రాష్ట్రంలో పొగాకు కిలో సగటు ధర కేవలం రూ.214 మాత్రమే. అంటే ఒకప్పుడు రూ.289 వచ్చిన చోట ఇప్పుడు రూ.214 మాత్రమే వస్తోంది. అంటే ప్రతి కిలోపై రైతు సుమారు రూ.75 నష్టపోతున్నాడు.

ఇదే ఉత్తరాది ప్రాంతంలో, ఇదే దేవరపల్లి ప్రాంతంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో 2023-24లో పొగాకు కిలో సగటు ధర రూ.326 ఉండేది. ఇప్పుడు అదే ప్రాంతంలో ఆ సగటు ధర కేవలం రూ.236కి పడిపోయింది.

ఒకవైపు ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులు, పెట్టుబడి వ్యయం అన్నీ పెరుగుతున్నాయి. మరోవైపు రెండు సంవత్సరాల క్రితం వచ్చిన ధరలు కూడా ఇప్పుడు రైతుకు రావడం లేదు. అంతే కాదు, పండించిన పంటను కొనుగోలు చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

**అతి తక్కువగా కొనుగోళ్లు:** ఈ ఉత్తరాది ప్రాంతంలో సుమారు 83 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, 105 రోజుల వేలం ముగిసే సమయానికి కొనుగోలు చేసినది కేవలం 10 మిలియన్ కిలోలు మాత్రమే. అంటే మొత్తం ఉత్పత్తిలో సుమారు 12 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. టొబాకో బోర్డు రైతులకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. పంట వేయండి. మేము కొనుగోలు చేస్తామని చెప్పింది. ఆ హామీని నమ్మి రైతులు పంట వేశారు. కానీ ఇప్పుడు హామీ ఇచ్చిన మేరకు కొనుగోలు జరగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 232 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ఇప్పటివరకు కొనుగోలు చేసినది కేవలం 47.3 మిలియన్ కిలోలు మాత్రమే. అంటే మొత్తం ఉత్పత్తిలో సుమారు 21 శాతం మాత్రమే కొనుగోలు చేశారు.

ఇది రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన పరిస్థితి. ఈ పరిస్థితికి బాధ్యత ఎవరిది? రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? అని ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాను.

ఇంకా నేను అడుగుతున్నాను. రైతులు నమ్మి పంట వేస్తే, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?. టొబాకో బోర్డు లిఖితపూర్వకంగా 142 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని నమ్మి రైతులు పంట వేశారు. కానీ చివరకు కొనుగోలు చేసింది కేవలం 47.3 మిలియన్ కిలోలు మాత్రమే. అంటే హామీ ఇచ్చిన పరిమాణంలో కేవలం 33 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. 105 రోజుల వేలం ప్రక్రియ ముగిసిపోయినా రైతుల వద్ద ఇంకా పెద్ద మొత్తంలో పొగాకు నిల్వలు ఉన్నాయి. ఇది రైతులకు ఎంతటి దుర్భర పరిస్థితిని తీసుకొచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

**నా పర్యటన ప్రకటన. రూ.10 పెంపు:** ఈరోజు నేను దేవరపల్లి వస్తున్నానని ప్రకటించిన తర్వాతే గత వారం, పది రోజులుగా కిలోకు సుమారు రూ.10 ధర పెరిగింది. నేను రాకపోయి ఉంటే ఆ పెంపు కూడా ఉండేది కాదు. ఈరోజు ఇక్కడ అత్యధిక ధర రూ.260 నుంచి రూ.262 వరకు మాత్రమే ఉంది. సగటు ధర రూ.174 వరకు పడిపోయింది. ఈ ధరలతో రైతు ఎలా బతుకుతాడు? ఎలా అప్పులు తీర్చుకుంటాడు? ఎలా మళ్లీ పంట వేస్తాడు?.

**దళారుల సిండికేట్. అయినా నో యాక్షన్:** పంట కొనుగోలు సక్రమంగా జరగడం లేదు. ఎక్కడ చూసినా 30 నుంచి 40 శాతం వరకు పొగాకును రిజెక్ట్ చేస్తున్నారు. 'నో బిడ్స్' పేరుతో వేలంలో కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీని వెనుక దళారుల సిండికేట్ పని చేస్తోందని రైతులే చెబుతున్నారు. కానీ ఈ ప్రభుత్వం ఒక్క కొనుగోలుదారుని కూడా బ్లాక్‌లిస్ట్ చేయలేదు. ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. రైతుకు భరోసా కల్పించే ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదు.

**గత మా ప్రభుత్వంలో ఏం చేశామంటే..:** అదే మా ప్రభుత్వం హయాంలో ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాం. మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు ప్రారంభించగానే ప్రతి గ్రేడ్‌కు కనీస ధర నిర్ణయించబడింది. కంపెనీల మధ్య పోటీ పెరిగింది. దాంతో రైతులకు మంచి ధర వచ్చింది. రిజెక్ట్‌లు తగ్గాయి. 'నో బిడ్స్' పరిస్థితి తగ్గింది.

అంతే కాదు.. నాడు మా ప్రభుత్వం రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసింది. ఐదేళ్లలో రూ.7,800 కోట్ల విలువైన పంటలను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచింది. రైతు ఇబ్బందుల్లో ఉన్న ప్రతిసారీ ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకుని ఆదుకుంది.

**ఇప్పుడు చేతులెత్తేసిన ప్రభుత్వం :** కానీ ఈ రోజు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేసింది ఏమిటి? దళారులతో రాజీ పడింది. కంపెనీలతో సర్దుబాట్లు చేసుకుంది. మార్క్‌ఫెడ్‌ను పోటీ కొనుగోలుదారుగా మార్కెట్‌లోకి తీసుకురాలేదు. రైతును పూర్తిగా దళారుల దయాదాక్షిణ్యాలకే వదిలేసింది.

ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న మరో అన్యాయం ఏమిటంటే.. రాష్ట్రంలో 232 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయినా, ప్రభుత్వం కేవలం 94 మిలియన్ కిలోలకు మాత్రమే మద్దతు ఇస్తామని చెబుతోంది. అంతే కాదు. కంపెనీలకు కిలోకు రూ.20 సబ్సిడీ ఇస్తామని ప్రకటిస్తోంది. ఈ సబ్సిడీ రైతుకు ఉపయోగపడేదా? అంటే కానే కాదు. కంపెనీలు రైతుకు ఇచ్చే ధరను మరింత తగ్గించే పరిస్థితి తీసుకొచ్చింది.

రైతు ప్రయోజనం కోసం ప్రభుత్వం పనిచేయాల్సింది పోయి, కంపెనీల ప్రయోజనాల కోసం విధానాలు రూపొందిస్తోంది.

అందుకే నేను స్పష్టంగా చెబుతున్నాను. వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలి. ప్రతి గ్రేడ్‌కు కనీస మద్దతు ధర ప్రకటించాలి. మార్కెట్‌లో పోటీ వాతావరణం తీసుకు రావాలి. అప్పుడు మాత్రమే రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది. మా ప్రభుత్వం హయాంలో ఇదే విధానాన్ని అమలు చేసి పొగాకు రైతులను ఆదుకున్నాం. ఇప్పుడు కూడా అదే మార్గం మాత్రమే రైతును కాపాడగలదు.

**చంద్రబాబు కంటితుడుపు మాటలు:** ఇంకో విషయం వింటే నిజంగా ఆశ్చర్యం వేస్తుంది. పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని చంద్రబాబుగారికి ఇప్పుడు గుర్తొచ్చిందట. అందుకే రూ.50 వేల వరకు మూడేళ్ల పాటు వడ్డీలేని రుణాలు ఇస్తామని చెబుతున్నారు.

నేను అడుగుతున్నాను. అయ్యా చంద్రబాబునాయుడు, మా ప్రభుత్వం హయాంలో లక్ష రూపాయల వరకు సున్నా వడ్డీ పంట రుణాలు ఇచ్చాం కదా! రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే లక్ష రూపాయల వరకు ఒక్క రూపాయి వడ్డీ కూడా లేకుండా రుణాలు అందే విధంగా కార్యక్రమాన్ని అమలు చేశాం. మా ప్రభుత్వ హయాంలో 84.66 లక్షల రైతులకు రూ.2,050 కోట్ల మేర సున్నా వడ్డీ రుణ ప్రయోజనం కల్పించాం. ఐదేళ్ల పాటు రైతులను ఆదుకున్న చరిత్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిది.

మరి మీరు ఏమి చేశారు? సున్నా వడ్డీ పథకాన్ని రద్దు చేశారు. రైతులకే కాదు, మహిళలకు పథకాన్ని రద్దు చేశారు. ఇప్పుడు అదే పథకాన్ని కొత్త పేరుతో రూ.50 వేల వరకు ఇస్తామని ప్రకటిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారు. దీనికంటే పెద్ద మోసం ఇంకేమైనా ఉంటుందా?

రైతులను ఆదుకోవాల్సిన సమయంలో ఆదుకోకుండా, ఎన్నికల హామీలను విస్మరించి ఇప్పుడు కొత్త పథకం తెచ్చినట్లు ప్రచారం చేయడం దౌర్భాగ్యం.

## టీడీపీ అంటే తెలుగు దుశ్శాసన పార్టీ

**విశాఖ:** టీడీపీ అంటే తెలుగు దుశ్శాసన పార్టీ అని మండిపడ్డారు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి. ఒక మహిళను టీడీపీ మంత్రి వేధించడం దారుణం. కూటమిది మంత్రి వర్గమా లేక వేధింపుల వర్గమా అనే అనుమానం కలుగుతోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే ఆ మంత్రిని వెంటనే భర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి స్థానంలో ఉన్న ఓ వ్యక్తి.. ఎన్‌ఆర్ఐ మహిళను వేధించడమేంటి?. తన సేవల కోసం వివరించడానికి ఒక మహిళ తన టీమ్‌తో వస్తానంటే ఆమెను మాత్రమే సదరు ఒంటరిగా రమ్మని చెప్పారంట. వెంటనే ఆ మంత్రిని బర్తరఫ్ చేయాలి. టీడీపీ అంటే తెలుగు దుశ్శాసన పార్టీ. ఆ మంత్రిపై కేసు పెట్టి విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కూటమి నేతలు మన రాష్ట్ర పరువును విదేశాల్లో కూడా తీస్తున్నారు. మహిళల గౌరవం విషయంలో ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?. చంద్రబాబుకి చిత్తశుద్ధి ఉంటే ఆ మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలి. ఇంత పెద్ద తప్పు చేసిన మంత్రిని రోడ్డుపై నడిపిస్తారా?. మేక, కోడిని కోస్తే మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి రోడ్డుపై నడిపించారు. ఇప్పుడు ఈ మంత్రి విషయంలో ఏం చేస్తారు?. కేబినెట్‌లో ఉన్న ముగ్గురు మహిళా మంత్రులు ఆ వేధింపుల మంత్రిని మెడ పట్టుకొని బయటకు గెంటేసే దమ్ముందా?. మహిళలపై ఈగ వాలితే నేనుంటా అన్న పవన్ కళ్యాణ్ ఏమయ్యారు?. ఈ విషయంలో ఎందుకు స్పందించలేదు.

ఈ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకపోగా వేరే దేశంలో ఉన్న తెలుగు మహిళలను మంత్రులు వేధిస్తున్నారు. కూటమి పాలనలో అడుగుకొక కీచకుడు ఉన్నాడు. మా ఎమ్మెల్యే విరూపాక్షిపై కేసు పెట్టడం కోసం టీడీపీ నేత తన భార్య బట్టలు చింపేసాడు. అరవ శ్రీధర్ విషయంలో కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా చర్యలు ఉండవని అంతా అనుకుంటున్నారు. ఆ మంత్రి పేరు బయటపెట్టాలి.. కేసు పెట్టాలి.. మంత్రివర్గం నుంచి ఆయన్ను భర్తరఫ్ చేయాలి. ఒక ఎన్‌ఆర్ఐ మహిళ తన ఆవేదన చెప్పుకుంటుంటే టీడీపీ సైకోలు పోస్టులు పెట్టి ఆమెను వేధిస్తున్నారు అంటూ మండిపడ్డారు.

## నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో డీఎస్సీలో ఉద్యోగాలు నిజమే

**విజయవాడ తూర్పు** : కొందరు నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లు సమర్పించి డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు పొందినమాట నిజమేనని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం చెప్పారు. ఈ అక్రమాల్లో క్రీడాసంఘాలు ప్రతినిధులతో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాత్ర కూడా ఉందని తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల భర్తీలో అనేక లోపాలు జరిగాయని చెప్పా రు. పలు క్రీడాసంఘాలు ఇచ్చిన నకిలీ సర్టిఫికెట్లతో క్రీడలతో ఏమాత్రం సంబంధం లేని చాలామంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. శాప్‌లో క్రీడాసంఘాల ప్రమేయం ఎక్కువ గా ఉండటంతో వారు చెప్పినట్లే శాప్ కార్యాలయంలో అంతా జరుగు తోందని విమర్శించారు. అందువల్లే నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపు గురించి శాప్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగాలు పొందినవారి సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించాలని కోరారు. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు మీద పండ్లు అమ్మిన రీతిలో క్రీడాసంఘాలకు చెందిన వారు క్రీడలతో సంబంధం లేనివారికి స్పోర్ట్స్ సర్టిఫికెట్లు అమ్మారని, ఇది బహిరంగ రహస్యమేనని చెప్పారు. బిహార్‌లో ఇలాగే జరిగితే ఫేక్ సర్టిఫికెట్లతో స్పోర్ట్స్‌కోటాలో ఉద్యోగాలు పొందిన వారిని అక్కడి ప్రభుత్వం డిస్మిస్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిందని, ఏడేళ్ల జీతాలను కూడా రికవరి చేసిందని తెలిపారు. శాప్‌లో వివిధ క్రీడాసంఘాల వారి ప్రమేయం చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. శాప్ మొత్తాన్ని ప్రక్షాళన చేయాలని సూచించారు. సమర్థులైన అధికారులను, క్రీడాస్ఫూర్తి ఉన్న వారిని శాప్ చైర్మన్, డైరెక్టర్లుగా నియమిస్తే ఇలాంటివి జరగకుండా ఉంటాయన్నారు. నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చిన క్రీడాసంఘాలపైన నిషేధం విధించాలని, నకిలీ సర్టిఫికెట్లను గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన శాప్ అధికారులను కూడా శిక్షించాలని డిమాండ్ చేశారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన ఆపరేషన్ గాండీవం అమలులో అవినీతి జరిగిందని, దీనిపై హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు.

## సీఆర్పీఎఫ్ జవాన్ల ఆత్మహత్యలు .. అత్యధికం విధుల్లో ఉన్నప్పుడే..



**న్యూఢిల్లీ:** సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) సిబ్బందిలో ఆత్మహత్యల ఘటనలు ఆందోళనకర స్థాయికి చేరాయి. అధికారిక సమాచారం ప్రకారం 2025లో సీఆర్పీఎఫ్ సిబ్బందిలో ఆత్మహత్యల సంఖ్య గత ఐదేళ్లలో అత్యధికంగా 59కి చేరింది. 2021 నుంచి మే 2026 వరకు ఉన్న కాలానికి సంబంధించి సేకరించిన ఈ డేటా, సిబ్బంది మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోంది. వృత్తిగత, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత సాధించలేకపోవడమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణమని సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

వివరాల ప్రకారం 2021లో 57, 2022లో 43, 2023లో 57, 2024లో 46, 2025లో 59 ఆత్మహత్యలు నమోదయ్యాయి. అలాగే 2026 మే నాటికి మరో 19 కేసులు వెలుగుచూశాయి. మొత్తం పరిశీలనా కాలంలో 281 ఆత్మహత్యలు జరిగాయి. వీటిలో దాదాపు 77 శాతం (216 కేసులు) సిబ్బంది విధుల్లో ఉన్నప్పుడే జరగడం గమనార్హం. సెలవులో ఉన్నప్పుడు 65 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా 2025లో సెలవులో ఉండి బలవన్మరణానికి పాల్పడిన వారి సంఖ్య 19కి చేరి, మునుపటి మూడేళ్ల సగటు కంటే రెట్టింపు కావడం గమనించదగ్గ విషయం.

వీరు ఆత్మహత్యలకు ఉపయోగించిన పద్ధతులను విశ్లేషిస్తే, ఉరి వేసుకోవడం, ఆయుధాలతో కాల్చుకోవడం ద్వారానే దాదాపు అన్ని (94 శాతం) ఘటనలు జరిగాయి. 281 కేసుల్లో 136 మంది ఉరివేసుకుని, 127 మంది కాల్చుకుని ప్రాణాలు కోల్పోయారు. భార్యాభర్తల మధ్య కలహాలు, కుటుంబ సభ్యుల మరణాలు, ఆర్థిక ఇబ్బందులు, పిల్లల చదువుకు సంబంధించి తగిన అవకాశాలు లేకపోవడం వంటి వ్యక్తిగత కారణాలే ప్రధానంగా ఒత్తిడికి గురిచేస్తున్నాయని ప్రభుత్వ టాస్క్‌ఫోర్స్ నివేదిక వెల్లడించింది. మగ సిబ్బందిలో సమస్యలను తోటివారితో పంచుకోవడానికి వెనుకాడటం వల్ల ఒత్తిడి పెరుగుతోందని, మహిళా సిబ్బందిలో ఆత్మహత్యల ప్రయత్నాలు తక్కువగా ఉన్నాయని నివేదిక పేర్కొంది.

## వరదలకు 95 మంది బలి, 1.6 లక్షల మంది అతలాకుతలం



**అస్సాం:** అస్సాంలో భారీ వర్షాలు, వరదల బీభత్సం కొనసాగుతోంది. రాష్ట్రంలో వరద ఉధృతి తీవ్రరూపం దాల్చడంతో మృతుల సంఖ్య 95కి చేరింది. సుమారు 1.6 లక్షలకు పైగా ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారు. 563 గ్రామాలు నీటమునిగాయి. శివసాగర్ జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఒక్క శివసాగర్‌లోనే 57 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. గోలఘాట్‌లో 34 వేల మంది, జోర్హాట్‌లో 25 వేల మంది వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని 14 జిల్లాలకు యంత్రాంగం హైఅలర్ట్ ప్రకటించింది. గౌహతిలోనూ పలు ప్రాంతాలు నీటమునిగాయి. రానున్న రోజుల్లో మరింతగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. బాధితుల కోసం 45 శిబిరాలను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 12,300 మందికి పైగా అక్కడ తలదాచుకున్నారు. మరోవైపు 32 వేల మందికి పైగా బాధితులకు బియ్యం, ఉప్పు, పప్పులు వంటి నిత్యావసరాలను అందించేందుకు 59 పంపిణీ కేంద్రాలను ప్రారంభించారు. అస్సాం వరద పరిస్థితిని ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అస్సాంలో పర్యటించి, సీఎం హిమంత బిస్వా శర్మతో కలిసి వరద పరిస్థితిని, సహాయక చర్యలను సమీక్షించారు. నష్టం తీవ్రంగా ఉన్నందున పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని నడ్డా తెలిపారు. ఆస్తి నష్టానికి సంబంధించి ఆర్థిక సహాయం, పరిహారం అందిస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్) నిబంధనలను సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## సమయపాలన తప్పితే.. గుండెకు ముప్పు!



రోజూ ఒకే సమయానికి నిద్రపోవడం కేవలం మంచి అలవాటు మాత్రమే కాదు, గుండె ఆరోగ్యాన్ని కాపాడే కీలక అంశమని తాజా పరిశోధన వెల్లడించింది. ప్రతిరోజూ నిద్రపోయే సమయం మారుతూ ఉంటే భవిష్యత్తులో గుండెపోటు, పక్షవాతం లాంటి తీవ్రమైన గుండె సంబంధిత సమస్యల ప్రమాదం దాదాపు రెండింతలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ అధ్యయనాన్ని ఫిన్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఊలు పరిశోధకులు నిర్వహించారు. ఉత్తర ఫిన్లాండ్‌కు చెందిన 3,231 మంది 46 ఏండ్ల వయసు గల వ్యక్తులపై పరిశోధన చేశారు.

వారి నిద్ర అలవాట్లను ఒక వారం పాటు ప్రత్యేక యాక్టివిటీ మానిటర్లతో నమోదు చేసి, తర్వాత పదేండ్లకు పైగా వారి ఆరోగ్య పరిస్థితులను విశ్లేషించారు. అధ్యయనంలో... ప్రతిరోజూ నిద్రపోయే సమయం మారుతూ, ఎనిమిది గంటల కంటే తక్కువ నిద్రపోయినవారిలో గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా కనిపించింది. అయితే లేచే సమయం కంటే, నిద్రపోయే సమయం క్రమబద్ధంగా ఉండటమే గుండె ఆరోగ్యానికి అత్యంత కీలకమని పరిశోధకులు పేర్కొన్నారు. అందుకే రోజూ ఒకే సమయానికి పడుకోవడం, కనీసం 78 గంటలు నిద్రపోవడం, సెలవు రోజుల్లోనూ నిద్ర వేళను ఎక్కువగా మార్చకుండా ఉండటం వంటి చిన్న అలవాట్లు గుండెను దీర్ఘకాలం ఆరోగ్యంగా ఉంచగలవని నిపుణులు సూచిస్తున్నారు.

## పెరుగుతున్న కోవిడ్ కేసులు



**అమరావతి:** రాష్ట్రంలో మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆదివారం ఒక కరోనా కేసు వెలుగులోకి వచ్చింది. నగరానికి చెందిన 21 ఏళ్ల యువకుడికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అతడిని జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని ప్రత్యేక ఐసోలేషన్ కోవిడ్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అతడితో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభించింది. అదేవిధంగా ఆదివారం బాపట్ల జిల్లా కర్లపాలేనికి చెందిన ఓ వ్యక్తికి చేసిన పరీక్షలో కోవిడ్ పాజిటివ్ వచ్చింది. బాధితుడు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోవిడ్ కేసుల సంఖ్య మూడుకు చేరుకుంది.

## నాగాలాండ్‌లో విరిగిపడ్డ కొండ చరియలు

**కోహిమా:** నాగాలాండ్‌లోని మోన్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఆదివారం తెల్లవారుజామున సంభవించిన భారీ కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో రాష్ట్రవ్యాప్తంగా కనీసం ఎనిమిది మంది మరణించినట్లు అక్కడి విపత్తునిర్వహణ శాఖ ప్రకటించింది, మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డట్లు తెలిపింది. గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు విరిగిపడటం ప్రారంభమైంది. ఈ విపత్తులో మోన్ టౌన్, తిజిత్ ప్రాంతాలు అత్యంత దారుణంగా దెబ్బతిన్నాయి. కొండచరియల ధాటికి పలు ఇళ్లు పూర్తిగా బురద, శిథిలాల కింద పూడుకుపోయాయి. సహాయక బృందాలు ఇప్పటివరకు శిథిలాల నుంచి నలుగురి మృతదేహాలను వెలికితీశాయి. కూలిపోయిన కట్టడాలు, బురద కింద మరో నలుగురు వ్యక్తులు చిక్కుకుపోయినట్లు సమాచారం. ప్రమాద స్థలాల నుండి రక్షించిన 12 మంది క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం కోసం పెద్దఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## 40 మందితో వెళుతున్న పడవ బోల్తా



**పాట్నా:** బిహార్‌లోని సీతామర్హి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. బాగ్‌మతి నదిలో దాదాపు 40 మందితో ప్రయాణిస్తున్న ఓ పడవ బరువు తట్టుకోలేక నదిలో బోల్తాపడింది. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి నదిలో పడ్డవారిని రక్షించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాగ్‌మతి నదికి ఇరువైపులా ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే ఖచ్చితంగా ఈ నది దాటాల్సిందే. అయితే ఈ నదిపై ప్రభుత్వం వంతెన నిర్మించకపోవడంతో రోజూ గ్రామస్థులు, రైతులు, విద్యార్థులు, ఇతర వ్యాపారులు తమ రోజువారీ పనులకోసం పడవల ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. కాగా పడవలు నడిపే వారు సామర్థ్యంకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు అంటున్నారు. వారు తక్షణమే స్పందించడంతోనే ఎవరికి ప్రాణాపాయం కలగలేదని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న స్థానిక పరిపాలనా యంత్రాంగం, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై స్పందించిన అధికారులు ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఓవర్ లోడింగ్‌కు పాల్పడే నావికులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నదిలో నడిచే అన్ని పడవల్లో తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్ వంటి ప్రాణరక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని నావికులకు ఆదేశాలు జారీ చేశారు.

# శల్య తంత్రానికి ఆద్యుడు సుశ్రుతుడు

రెండున్నర వేల సంవత్సరాల కిందట భారతదేశంలో వెలసిన వైద్యవిజ్ఞానం, నేడు ప్రపంచంలోని అత్యున్నత శస్త్రచికిత్సా సంస్థల నివాళులందుకుంటున్నది. స్కాట్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో భారతీయ ప్రాచీన రుషి, వైద్యుడు సుశ్రుతుడి విగ్రహాన్ని ఈ నెల 19న ఆవిష్కరించారు. 90 కిలోల ఈ కాంస్య విగ్రహాన్ని తమిళనాడులోని స్వామిమలై స్థపతులు భారతీయ శిల్ప సంప్రదాయానికి అనుగుణంగా రూపొందించారు. కొన్నేళ్ల కిందట ఆస్ట్రేలియాలోని రాయల్ ఆస్ట్రేలేషియన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ప్రాంగణంలో కూడా ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక శస్త్రచికిత్సా సంస్థలలో రెండు ఒకే భారతీయ మహర్షిని ఈ విధంగా గౌరవించడం అత్యంత అరుదైన విషయం. ఆ ప్రాచీన సంపదకు వారసులైన భారతీయులందరికీ గర్వకారణం కూడా.

పూర్వం ప్రాచీన భారతదేశం, మధ్య ఆసియా ప్రాంతాలలో కొన్ని నేరాలకు ముక్కు ఖండించడం శిక్షగా అమలులో ఉండేది. అరణ్యవాసంలో ఉన్న సీతకు అపకారం చేయబోయి, లక్ష్మణుడి చేతిలో శూర్పణఖ తన ముక్కు-చెవులను కోల్పోయిన ఘటన రామాయణంలో ప్రసిద్ధమే. 'అయోముఖి' అనే మరో రాక్షస స్త్రీ కూడా లక్ష్మణుని చేతిలో ముక్కును పోగొట్టుకుంది. అంతేకాదు, యుద్ధాలు, ప్రమాదాలు, అడవి మృగాల దాడులు లాంటి అనేక కారణాల వల్ల కూడా ముక్కు, చెవులు వంటి శరీర భాగాలు ఛిద్రమయ్యేవి. అందువల్ల నాసికను పునర్నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ సమస్యకు శాస్త్రీయ పరిష్కారాన్ని అందించిన మహర్షే సుశ్రుతుడు. నేడు ప్రపంచవ్యాప్తంగా రైనోప్లాస్టీగా ప్రసిద్ధి చెందిన నాసికా పునర్నిర్మాణ శస్త్రచికిత్సను వ్యవస్థీకరించడమే కాకుండా, సుశ్రుతుడు దానిని శాశ్వతంగా గ్రంథస్థం చేశాడు.

క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దంలో వారణాసి ప్రాంతంలో సుశ్రుతుడు విద్య అభ్యసించినట్లు చెబుతారు. ఆయనకు సంబంధించిన సమాచారం పరిమితంగానే ఉంది. కానీ, సుశ్రుతుడు రచించిన 'సుశ్రుత సంహిత' భారతీయ వైద్యవిజ్ఞాన చరిత్రలో మైలురాయిగా నిలిచింది. సహస్రాబ్దాల కాలగమనాన్ని తట్టుకొన్న ఈ గ్రంథం నేటికీ లభ్యమవుతుండటం భారతీయ సాంస్కృతిక-వైద్య వారసత్వానికి సజీవ సాక్ష్యం.

ఆయుర్వేద సంప్రదాయం ప్రకారం.. క్షీరసాగర మథనంలో ఆవిర్భవించిన ధన్వంతరి.. తరువాత కాశీరాజు దివోదాసు రూపంలో అవతరించి, మానవాళికి వైద్యవిద్యను బోధించినట్లు భావిస్తారు. సుశ్రుతుడు ఆ ఆచార్య పరంపరకు చెందినవాడిగా ఆయుర్వేద గ్రంథాలు పేర్కొంటాయి. దివోదాసు ఆయుర్వేదాన్ని అధ్యయన సౌలభ్యం కోసం అష్టాంగ ఆయుర్వేదంగా ఎనిమిది శాఖలుగా విభజించాడు. అవి శల్యతంత్రం, శాలాక్యతంత్రం, కాయ చికిత్స, కౌమార భృత్యం, అగద తంత్రం, రసాయన తంత్రం, వాజీకరణం, భూతవిద్య అనే పేర్లతో ప్రసిద్ధికెక్కాయి. పేర్లు ప్రాచీనమైనవైనా, వాటి అధ్యయన పరిధిని పరిశీలిస్తే అవి నేటి అల్లోపతీ విధానంలోని శస్త్రచికిత్స, నేత్ర-కర్ణ-నాసిక, సాధారణ, శిశు, విషం విరుగుడు, వృద్ధాప్య, పునరుత్పత్తి, మానసిక వైద్య విభాగాలకు సమాంతరమైన అధ్యయన రంగాలుగా ఉన్నట్లు గోచరిస్తుంది. రెండున్నర వేల ఏళ్ల అంతరంతో, వేర్వేరు ఖండాలలో రూపుదిద్దుకున్న ఈ రెండు వైద్య విధానాలలో కొట్టొచ్చినట్లు కనిపించే భావసారూప్యత విస్మయాన్ని కలిగిస్తుంది.

భారతీయ వైద్య సంప్రదాయంలో చరక సంహితకు ఔషధ చికిత్సలో ఎంతటి ప్రాధాన్యం ఉందో, శస్త్రచికిత్సా రంగంలో సుశ్రుత సంహితకు అంతటి విశిష్ట స్థానం ఉంది. చరకుడు కాయ చికిత్సకు మార్గదర్శకుడైతే, సుశ్రుతుడు శస్త్రచికిత్సకు దిశానిర్దేశం చేసిన మహర్షి. అయితే అన్ని శాఖలలోనూ శల్యతంత్రానే అత్యున్నత శాఖగా సుశ్రుతుడు పరిగణించాడు. ఇతర చికిత్సల ఫలితాలు కాలక్రమంలో వెల్లడవుతాయి; శస్త్రచికిత్స మాత్రం తక్షణ ఫలితాలనిస్తుందని ఆయన విశ్వసించాడు. ఆ భావన నేటికీ సమకాలీనంగానే ఉంది.

సుశ్రుత సంహిత కేవలం శస్త్రచికిత్సల జాబితాగా మాత్రమే కాకుండా; శల్యతంత్రానికి సంబంధించిన విజ్ఞాన సర్వస్వంగా రాణిస్తున్నది. ఇందులో మూడు వందలకు పైగా శస్త్రచికిత్సా విధానాలు, నూట ఇరవైకి పైగా వివిధ ధాతువులతో తయారైన శస్త్ర పరికరాల నిర్మాణం, వాటి వినియోగం గురించి ప్రస్తావించి ఉంది. వాటిలో కరపత్రం, మండలాగ్రం, వృద్ధిపత్రం వంటి అనేక పరికరాలను నేటి శస్త్ర పరికరాలకు పూర్వరూపాలుగా భావిస్తుంటారు. నేత్ర శస్త్రచికిత్స, ఎముకలను జోడించటం, గర్భసంబంధ అత్యవసర చికిత్సలు, మూత్రాశయ రాళ్ల తొలగింపు, చెవి-పెదవుల పునర్నిర్మాణం, గాయాల చికిత్స, చర్మ మార్పిడి వంటి అనేక వైద్య ప్రక్రియలను ఈ గ్రంథం వివరిస్తుంది. అంతేకాదు, శరీర నిర్మాణ శాస్త్రం, శవపరీక్ష, వైద్యుని నైతిక బాధ్యతలు, వైద్య విద్యార్థుల శిక్షణ, వైద్యశాలల నిర్వహణ వంటి అంశాలు ఇందులో పొందుపర్చడం విశేషం.

సుశ్రుత సంహితలో వివరించిన నాసికా పునర్నిర్మాణ విధానం నేటికీ వైద్య చరిత్రకారులను ఆశ్చర్యపరుస్తున్నది. ఈ పద్ధతిలో ముందుగా రోగి ముఖాన్ని పరిశీలించి, ముక్కు అసలు ఆకారం, పరిమాణాన్ని అంచనా వేస్తారు. తరువాత నుదుటి చర్మాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో కత్తిరించేవారు. అయితే చర్మాన్ని పూర్తిగా వేరు చేయకుండా, దాని ఒక చివరను నుదుటికి అనుసంధానం గానే ఉంచడంతో - రక్తప్రసరణ నిరంతరంగా కొనసాగి, చర్మ కణజాలం సజీవంగా ఉండేది. అనంతరం దానిని ముక్కు ఆకారంలో అమర్చి కుట్టేవారు. ముక్కు రంధ్రాలు మూసుకుపోకుండా చిన్న గొట్టాలను అమర్చడం, ఔషధ లేపనాలు, సంక్రమణ నివారణ వంటి అంశాలను కూడా ఆయన నిశితంగా వివరించాడు. శరీర నిర్మాణం, రక్తప్రసరణ, కణజాలం గురించి లోతైన అవగాహనతో రూపొందిన ఈ శాస్త్రీయ విధానం, తరువాతి కాలంలో 'భారతీయ విధానం'గా విశ్వవిఖ్యాతమైంది.



సుశ్రుత సంహిత అనేక శతాబ్దాల క్రితమే అరబ్బు విద్వాంసుల దృష్టిని ఆకర్షించడంతో, అది అరబ్బీ భాషలోకి అనువాదమై పశ్చిమాసియాకు చేరింది. ఆపై అరబ్బు వైద్యుల రచనల ద్వారా ఐరోపాకు పరిచయమయ్యాయి. ఆధునిక సమాచార సౌకర్యాలు లేని కాలంలోనే... భారతదేశంలో రూపుదిద్దుకున్న వైద్యవిజ్ఞానం భాషలను, సముద్రాలను, నాగరికతలను దాటి ఖండాంతరాలకు ప్రయాణించడం మానవ విజ్ఞాన చరిత్రలో విశేషమైన ఘట్టం.

నేడు ప్రపంచ వైద్య చరిత్రలో హిప్పోక్రటీస్, గాలెన్ వంటి మహనీయులను ఎంత గౌరవంగా స్మరిస్తారో, అదే గౌరవంతో సుశ్రుతుడి పేరును కూడా తలచుకుంటున్నారు. రెండున్నర వేల సంవత్సరాల క్రితం సుశ్రుతుడు వ్యవస్థీకరించిన శల్యతంత్ర విధానం ఖండాంతర ప్రస్థానాన్ని గమనిస్తే, ప్రపంచంలోని అనేక వైద్య చరిత్ర గ్రంథాలు ఆయనను 'శస్త్రచికిత్స పితామహుడు', 'నాసికా పునర్నిర్మాణ శస్త్రచికిత్సకు ఆద్యుడు'గా పేర్కొనడం యాదృచ్ఛికం కాదని స్పష్టమవుతుంది. రెండున్నర వేల సంవత్సరాల క్రితం వారణాసిలో ప్రారంభమైన ఆ విజ్ఞాన యాత్ర ఇంకా కొనసాగుతూ; ఎడిన్‌బర్గ్‌లోని కాంస్యవిగ్రహం రూపంలో, ప్రపంచ వైద్యచరిత్రపై భారతదేశం వేసిన చెరగని ముద్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నది.

'శాస్త్రజ్ఞానం మాత్రమే ఉండి ఆచరణలో నైపుణ్యం లేనివాడు, ఆచరణలో ప్రవీణుడైనా శాస్త్రజ్ఞానం లేనివాడు - ఇద్దరూ వైద్య వృత్తిలో రాణించలేరు' అన్న సుశ్రుతుడు చెప్పిన ఒక సూత్రం నేటికీ సమయోచితంగానే ఉంటుంది. పుస్తక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం రెండూ సమపాళ్లలో రంగరించినప్పుడే నిజమైన వైద్యుడు రూపుదిద్దుకుంటాడన్న ఈ భావన ఆధునిక వైద్య విద్యకు కూడా మార్గదర్శకమే.

# అపోహలను సృష్టించేందుకే గొడ్డలి పార్టీ ప్రయత్నం

## మంత్రి కొండపల్లి



**విజయనగరం :** జరగని వాటిని జరిగినట్లు అపోహలను సృష్టించడం ద్వారా రాజకీయంగా లబ్ది పొందేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వైఎస్సార్సీపి మీద మండిపడ్డారు. ఏ విధంగా డిఎస్సీ జరిగిందో, ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందో అధికారులే మీడియా ముందు వివరణ ఇచ్చినా కూడా ఆ పార్టీ నానా యాగీ చేయడం దారుణమన్నారు. ఇచ్చిన మాటకి కట్టుబడి మెగాడిఎస్సీ నిర్వహించి, ఉద్యోగాలను కల్పించడాన్ని తట్టుకోలేకనే వైఎస్సార్సీపి ఇలా నానా కష్టాలుపడుతోందన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు డిఎస్సీ వేయని వారు, ఇప్పుడు డిఎస్సీ వేస్తే ఆనందపడాల్సింది పోయి, ఉద్యోగాలు చేస్తున్న వారిలో భయోందోళనకు గురిచేసే విధంగా వ్యవహరించడం ఒక రాజకీయ పార్టీకి తగదన్నారు. నవ్యాంధ్రాలో ఉద్యోగాలను ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరేనని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడే 9 డీఎస్సీలతో లక్షా 80 వేలకి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టి ఆరు నెలల్లోనే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. డీఎస్సీపై వైసీపీ ప్రభుత్వం 230కి పైగా కేసులు వేసినా ప్రభుత్వం ఆన్సర్ షీట్లు, ఫలితాలు, ఎంపిక అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి తన పారదర్శకత నిరూపించుకుందన్నారు. గత ప్రభుత్వం 8 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేక నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వస్తున్నాయని.. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్య ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు నిదర్శనం అన్నారు. గతంలో విద్యాశాఖా మంత్రిగా పనిచేసిన బొత్స సత్యన్నారాయణ తన స్థాయికి తగ్గట్లు మాట్లాడితే హుందాగా ఉంటుందన్నారు. వోక్స్‌వ్యాగన్ లావాదేవీలతో బొత్స రాష్ట్రానికి పెద్ద మచ్చ తేవడంతోనే ఆ ప్రాజెక్టు మహారాష్ట్రకు తరలిపోయిందన్నారు. ఇటీవల తాము నిర్వహించిన డిఎస్సీలో జిల్లాలో 583 మందికి గత డీఎస్సీలో ఉపాధ్యా య ఉద్యోగాలు వచ్చాయన్నారు. వారితో మాట్లాడితే ఆ డీఎస్సీ పరీక్ష ఎంత పారదర్శకంగా జరిగిందో వారికి తెలుస్తుందన్నారు.

**భోగాపురం విమానాశ్రయ ప్రారంభానికి సర్వం సిద్ధం :**

అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ హరిత విమానాశ్రయం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయని మంత్రి తెలిపారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి చేతుల మీదుగా జాతికి అంకితం కాబోతోందన్నారు. 3 లక్షల మందితో కనివినీ ఎరుగని రీతిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ట్రాఫిక్, రవాణా, ఆహారం అన్ని విషయాల్లోనూ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు. ఈ విమానాశ్రయం రాకతో విశాఖ-ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఐటీ , ఫార్మా, బయోటెక్నాలజీ, స్టీల్ మరియు ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. వేలాదిమంది యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందన్నారు. ఎయిర్‌పోర్ట్ భూసేకరణ నిర్వాసితులకు సంబంధించిన 20 కేసులు వైజాగ్ ట్రైబ్యునల్ (వైజాగ్) పరిధిలో ఉన్నాయన్నారు. ఇటీవలనే ఆ ట్రైబ్యునల్‌కి జడ్జి నియామకం జరిగినందున ఆ సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే హైకోర్టులోని 50 కేసులను కూడా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు.

# సోషల్ మీడియా మోహం.. సంసారాల్లో క్రైమ్ దాహం!

**అమరావతి:** నిండునూరేళ్లు కలిసి జీవించాల్సిన దాంపత్య బంధాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చుపెడుతున్నాయి. అనుమానాలు, ఆర్థిక ఒత్తిళ్లు, ఆస్తి వివాదాలు సైతం చివరికి దారుణ హత్యలకు దారితీస్తున్నాయి. దీంతో కుటుంబ వ్యవస్థ విచ?ఛన్నం అవుతోంది. ఇటీవల దేశవ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భార్యలు భర్తలను హత్య చేస్తున్న ఘటనలు యావత్ సమాజాన్ని విస్తుగొలుపుతున్నాయి. ముఖ్యంగా భర్తలను చంపడంలో మహిళలు అనేక సరికొత్త మార్గాలను ఎంచుకోవడం తీవ్ర విస్మయం కలిగిస్తోంది. ప్రెషర్ కుక్కర్, నీళ్ల డ్రమ్, బాత్‌రూమ్ టైల్స్ కింద, గ్యాస్ సిలిండర్‌లో ఇలా అనేక చోట్ల భర్త మృతదేహాలను దాచిపెట్టడం భీతిగొలుపుతోంది. కొండపై నుంచి తోసేయడం, తినే ఆహారంలో విషం కలపడం, విషం నింపిన ఇంజక్షన్లు చేయడం, కత్తితో పొడవడం, గొంతు నులిమి చంపేయడం, కిరాయి వ్యక్తులతో హత్య చేయించడం వంటి మార్గాలను ఎంచుకుని మరీ కట్టుకున్న వాడిని కడతేర్చుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఏర్పడుతున్న పరిచయాలు తీవ్ర నేరాలకు పురిగొల్పుతున్నాయి. కొంత కాలం పరిచయాలే బంధాలుగా ఏర్పడి, అప్పటికే ఉన్న బంధాలను తెంచుకునేలా ప్రోత్సహిస్తున్నాయి. ఏపీలోని ప్రకాశం, అనకాపల్లి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో, తెలంగాణలోని రంగారెడ్డి, మేడ్చల్, నల్గొండ జిల్లాల్లో భర్త హత్య కేసులు ఇటీవల సంచలనం సృష్టించాయి. చాలా ఘటనల్లో వివాహేతర సంబంధాలు, అనుమానాలు, కుటుంబ కలహాలే ప్రధాన కారణాలుగా తేలాయి. హత్యలకు కుటుంబ, వ్యక్తిగత వివాదాలే కారణమని జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ వైద్యులు నిర్వహించిన అధ్యయనం ప్రకారం, హత్యలకు గురైన కేసుల్లో 36.36 శాతం కుటుంబ, ఆస్తి వివాదాలు, 29.55 శాతం వివాహేతర సంబంధాల వల్ల జరిగినట్లు తేలింది. బాధితులు, నిందితులు ఎక్కువగా ఒకరికొకరు పరిచయం ఉన్నవారేనని అధ్యయనం వెల్లడించింది. వివాహేతర సంబంధాలపై గ్లిడెన్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఆందోళన కలిగించే అంశాలు బయటపడ్డాయి. దేశంలోని టైర్-1, టైర్-2 నగరాలకు చెందిన 1,503 మంది వివాహితులపై నిర్వహించిన ఈ అధ్యయనం ప్రకారం 37 శాతం మంది ప్రేమలో ఉన్నప్పటికీ భాగస్వామిని మోసం చేయడం సాధ్యమేనని అభిప్రాయ పడ్డారు. 55 శాతం మంది తమ జీవిత భాగస్వామి కాకుండా మరొకరితో సన్నిహి తంగా ఉండాలని కోరుకుం టున్నట్లు తెలిపారు. పది మందిలో ఆరుగురికిపైగా వివాహేతర సంబంధాలపై ఆసక్తి చూపినట్లు సర్వే పేర్కొంది. అలాగే పురుషుల్లో 59 శాతం, మహిళల్లో 53 శాతం మంది తమ భాగస్వామిపై అవిశ్వాసం లేదా అనుమానం వ్యక్తం చేశారు.

## బూతులు తిట్టడం 'అశ్లీల' నేరం కాదు

**న్యూఢిల్లీ:** తిట్లు ఎంత అభ్యంతరకరంగా, అనాగరికంగా ఉన్నప్పటికీ అసభ్య పదజాలం, బూతులు తిట్టడం అశ్లీల నేరంగా పరిగణించలేమని దేశ సర్వోన్నత న్యాయస్థానం చెప్పింది. ఒకరిని 'మదర్ ఫ...ర్', 'సన్ ఆఫ్ ఎ వోర్' వంటి అసభ్య పదాలతో దూషించడం అశ్లీలం కాదని వ్యాఖ్యానించింది. చట్టపరంగా అశ్లీలంగా పరిగణించాలంటే వాటికి ప్రత్యేకమైన ప్రమాణాలు ఉండాలని స్పష్టం చేసింది. తమిళనాడుకు చెందిన మణి అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను పాక్షికంగా అనుమతించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ పంఛోలీల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా కోర్టు చట్టపరమైన 'అశ్లీల' భావనను విశదీకరించింది. 'అసభ్యత (వల్గారిటీ), తిట్లు (అబ్యూజ్), బూతులు (ప్రొఫానిటీ) చట్టపరంగా అశ్లీలత కాదు. కేవలం బూతులు మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం, తిట్టడాన్ని అశ్లీల నేరంగా పరిగణించలేం. అలాంటి పదాలు అసహ్యం, విరక్తి లేదా షాక్‌కు గురిచేయవచ్చు. లైంగిక ఉద్రేకాన్ని రేకెత్తించే, కామప్రేరిత ఆసక్తిని ప్రోత్సహించే, విన్నవారి నైతిక విలువలను దెబ్బతీసే లేదా వారిని నీతిభ్రష్ను?టలుగా మార్చే ప్రభావం ఉంటేనే అశ్లీలంగా పరిగణించవచ్చు. బహిరంగ ప్రదేశంలో ఇతరులకు ఇబ్బంది కలిగించిందని నిరూపించాల్సి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది.








# అది రాజ్యాంగబద్ధమేనా?

**అమరావతి** : బంకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయాన్ని 'పూర్తిగా పాడాలి' (అంటే ఆరు చరణాలనూ పాడాలి) అంటూ ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందింది. లోక్‌సభ, రాష్ట్రపతి ఆమోదాల తరువాత అది చట్టమవుతుంది. ఆ తరువాత, ఈ గేయాన్ని ఎక్కడైనా పూర్తిగా పాడకపోయినా, దాన్ని అవమానించినా, ఆటంకపరిచినా అలా చేసిన వాళ్లకు మూడేళ్ల జైలుశిక్ష పడుతుంది.

1971లో తయారు చేసిన 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్ సల్ట్స్ టు నేషనల్ హానర్ యాక్ట్'ను ప్రభుత్వం సవరిస్తూ ఈ బిల్లు ప్రవేశపెట్టింది. నిజానికి ఆ చట్టంలో-- 'జాతీయ జెండానిగానీ, జాతీయ గీతాన్ని గానీ, రాజ్యాంగాన్నిగానీ ఎవరైనా అవమానిస్తే వారు శిక్షార్హులవుతారు' అని మాత్రమే వుంది. 'వందే మాతరం' గురించి ఏమీ లేదు. ఆ చట్ట పరిధిలోకి ఇప్పుడు దీన్ని కూడా తెస్తున్నారు.

జనగణమనకూ, వందేమాతరానికీ తేడా వుంది. ఆ తేడా ఉండటం వలనే అది 'జాతీయ గీతం' కాలేక పోయింది. మొత్తం 'ఆరు చరణాలు' గా ఉండే అందులో మొదటి రెండు చరణాల్లో ప్రకృతి గురించి, భూమి గురించి, దేశభక్తి గురించి వర్ణన ఉంటుంది. ఆ తరువాత వచ్చే నాలుగు చరణాల్లో-- భూమిని తల్లితో, ఆ తల్లిని కాళికతో, సరస్వతితో, లక్ష్మితో పోలుస్తూ ఉంటుంది. అంటే-- హిందూ ఆధ్యాత్మికతా, దేశభక్తీ రెండూ కలగలసి ఉంటాయి.

ఛటర్జీ ఈ గేయాన్ని విడిగా రాయలేదు. 1870లో రాసిన 'ఆనంద్ మఠం' నవలలోనిది అది. 1896 కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో 'రవీంద్రనాథ్ టాగూర్' దీన్ని మొదటగా ఆలపించారు. అప్పటికి ఆయన 'జనగణమన' రాయలేదు. అంతకుముందు సాహిత్యకారులలోనే ఆ పాటకు, టాగూర్ పాడాక, జాతీయ గుర్తింపు వచ్చింది. 1905లో 'లార్డ్ కర్జన్' బెంగాల్‌ను విభజించాక, అదొక 'ఉద్యమ నినాదం'గా మారింది. బ్రిటిష్ ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో 'వందే మాతరం' నినాదాన్ని నిషేధించింది. నిషేధం కారణంగా ఇది మరింత ప్రజాదరణ పొందింది. రానురాను స్వాతంత్ర్య ఉద్యమంలో ఇది భావోద్వేగ గీతంగా కూడా నిలిచింది.

1930లలో కాంగ్రెస్ వర్గాల్లో దీన్ని 'జాతీయ గీతం'గా స్వీకరించాలనే చర్చలు జరిగాయి. కానీ 'ముస్లిం లీగ్ నాయకులు' అభ్యంతరం తెలిపారు. లీగ్ వాళ్ళే కాకుండా కాంగ్రెస్‌లోని ముస్లిమ్స్ కూడా తమ అభ్యంతరాల్ని బైట పెట్టడం మొదలెట్టారు. వాళ్ళల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ (కాంగ్రెస్ అధ్యక్షుడు, తొలి విద్యాశాఖమంత్రి) ప్రథములు. 'వందే మాతరానికి స్వాతంత్ర్య ఉద్యమంలో చారిత్రక పాత్ర ఉంది. దాన్ని ఎవ్వరమూ కాదనలేము కానీ, వాటి లోని హిందూ దేవతారాధన భావనలతో కూడిన వ్యాఖ్యలు ముస్లింలకు అసౌకర్యాన్ని కలిగిస్తాయి. మొదటి రెండు శ్లోకాలు మాత్రమే దేశభక్తిని సూచిస్తాయి' అని ఆయన తన అభిప్రాయాన్ని ప్రక టించారు. మౌలానా మహ్మద్ అలీ జౌహర్ (ఖిలాఫత్ నాయకుడు) 'వందే మాతరాన్ని నినాదంగా వాడటానికి నేను వ్యతిరేకం కాదు; కానీ దాన్ని మతసంబంధమైన ప్రతీకగా మార్చకూడదు' అన్నారు. ఎప్పుడైతే ముస్లిం సమూహం నించి వ్యతిరేకత వచ్చిందో, హిందూ సమూహంలోని వాళ్ళు కూడా మాట్లాడటం మొదలు పెట్టారు. రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మొదటి అడుగులు వేశారు. 'వందే మాతరం పట్ల గౌరవం ఉండాలి. కానీ ఎవ్వరి మనస్సాక్షికీ వ్యతిరేకంగా బలవంతం చేయకూడదు' అన్నారు.

ఆ తరువాత జనగణమనను 'జాతీయ గీతం'గా చేస్తూ, 'వందే మాతరం'కు సమాన గౌరవం ఇస్తూ (మొదటి రెండు పద్యాలకే పరిమితం చేస్తూ) 1950 జనవరి 24న రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనను చేశారు. దీని మీద గాంధీజీ కూడా మాట్లాడారు. 'వందే మాతరం దేశభక్తి గీతం. మత భావనతో ఎవరికైనా ఇబ్బంది అయితే బలవంతం చేయరాదు. దేశభక్తి అనేది స్వచ్ఛందంగా ఉండాలి. బలవంతం చేస్తే అది హింసతో సమానం' అన్నారు. అనేక మతాలు ఉన్న ఈ దేశంలో హిందూ మతానికి చెందిన దేవతా మూర్తుల్ని ఆరాధించే చరణాల్ని 'తప్పనిసరిగా మొత్తం పాడాలి' అనడం న్యాయమేనా? అది లౌకికత్వం అవుతుందా? రాజ్యాంగబద్ధం అవుతుందా?




**ఢిల్లీ** : భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పయనంలో దూసుకుపోతోందనడానికి నిదర్శనంగా జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం జులై నెలలో స్థూల జీఎస్టీ రాబడి 15.4 శాతం వృద్ధితో రూ.2.11 లక్షల కోట్లకు చేరింది. గత 14 నెలల కాలంలోనే ఇవే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు పుంజుకోవడంతో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వసూళ్లు ఏకంగా 28.8% పెరిగి రూ.66,511 కోట్లకు ఎగబాకాయి. ఇక స్వదేశీ లావాదేవీల ద్వారా లభించిన రాబడి 10.1 శాతం పెరిగి రూ.1.45 లక్షల కోట్లుగా నమోదైంది. వ్యాపారులకు ఇచ్చే రీఫండ్లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి లభించిన నికర జీఎస్టీ రాబడి 15.8% వృద్ధితో రూ.1.81 లక్షల కోట్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో (ఏప్రిల్-జులై) స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు పెరిగాయి. ఈ-ఇన్వాయిసింగ్ విధానం పక్కాగా అమలుకావడం, డేటా విశ్లేషణ ద్వారా పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేయడం ఆదాయానికి ప్రధాన చోదకాలుగా నిలిచాయి. వచ్చే పండుగల సీజన్‌తో రాబోయే త్రైమాసికాల్లో వినియోగం మరింత పెరిగి జీఎస్టీ రాబడి కొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు సిల్వర్.. యశ్వీర్ సింగ్‌కు కాంస్యం

**గ్లాస్‌గో:** భారత జావెలిన్ స్టార్ త్రోయర్ నీరజ్ చోప్రా.. కామన్‌వెల్త్ క్రీడల్లో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. ఇదే ఈవెంట్‌లో మరో ఇండియన్ అథ్లెట్ యశ్వీర్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తన చివరి త్రోతో యశ్వీర్ అనూహ్య రీతిలో మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన 28 ఏళ్ల నీరజ్ చోప్రా .. కామన్‌వెల్త్ గేమ్స్‌లో రెండో అటెంప్ట్‌లో 85.83 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావించారు. కానీ పాక్ అథ్లెట్ అనుకోని రీతిలో నిష్క్రమించాడు. ఇటీవల వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన శ్రీలంక అథ్లెట్ రుమేశ్ తరంగ పతిరగే సత్తా చాటాడు. అతను జావెలిన్‌ను 89.75 మీటర్ల దూరం విసిరి బంగారం పతకాన్ని కైవసం చేసుకున్నాడు.(గ్లాస్‌గోలో ప్రస్తుతం చల్లని వాతావరణం ఉన్నది. బలమైన గాలులు కూడా వీస్తున్నాయి. ఇలాంటి వాతావరణంలో జావెలిన్‌ను సుమారు 90 మీటర్ల దూరం వరకు విసరడం అంత సులువైన అంశం కాదు. ఈ సీజన్‌లో జావెలిన్‌ను 90 మీటర్ల మార్క్ దాటించిన ఏకైక క్రీడాకారుడి జాబితాలో రుమేశ్ తరంగ ఉన్నాడు. ఇక ఈవెంట్‌లో 24 ఏళ్ల యశ్వీర్ అసాధారణ ప్రతిభ కనబరిచాడు. తొలిసారి కామన్‌వెల్త్ గేమ్స్ ఆడుతున్న అతను.. అందర్నీ స్టన్ చేస్తూ తన జావెలిన్‌ను 85.41 మీటర్ల దూరం విసిరాడు. తన చివరి ఆరో ప్రయత్నంలో అతను ఆ దూరానికి జావెలిన్‌ను విసిరి ఇండియాకు పతకాల సంఖ్యను పెంచేశాడు.



## స్కూల్స్ వద్ద జంక్ ఫుడ్ బ్యాన్!

బడి ఈడు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా మహారాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాల ప్రాంగణాల్లోనూ, వాటికి 50 మీటర్ల పరిధిలోనూ జంక్ ఫుడ్ (కొవ్వులు, షుగర్, సాల్ట్ అధికంగా ఉండే పదార్థాలు) విక్రయాలు, ఉచిత పంపిణీ, ప్రకటనలపై సంపూర్ణ నిషేధం విధిస్తూ మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, పాఠశాలల్లో నిర్వహించే క్యాంటీన్లకు ఆహార భద్రతా లైసెన్సులను తప్పనిసరి చేసింది.

**వడాపావ్, సమోసాలకు** స్వస్తి : చిన్నారుల్లో పెరుగుతున్న ఊబకాయం, ఇతర జీవనశైలి సమస్యలను అరికట్టేందుకు ఈ కఠిన నిబంధనలను అమల్లోకి తెచ్చారు. నూతన ఆదేశాల ప్రకారం.. మహారాష్ట్రలో అత్యంత ప్రజాదరణ పొందిన వడాపావ్, సమోసాలతో పాటు నూనెలో వేగించిన తిను బండారాలు, చిప్స్, కూల్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లను పాఠశాలల్లో లేదా వాటి సమీపంలో విక్రయించకూడదు. స్టేట్ బోర్డ్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వంటి బోర్డులతో సంబంధం లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. దీనివల్ల దాదాపు రెండు కోట్లకు పైగా విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

**క్యాంటీన్లకు లైసెన్స్ నిర్బంధం** : ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారాం ముండే వెల్లడించిన వివరాల ప్రకారం.. బడులలో క్యాంటీన్లు నడిపే వెండర్లు తప్పనిసరిగా ఎఫ్‌డీఏ నుంచి అధికారిక లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. పాఠశాల యాజమాన్యాలే స్వయంగా క్యాంటీన్ నడిపినా లైసెన్స్ తీసుకోవడం విధిగా మారింది. చిన్నారుల నుంచి 17 ఏళ్ల టీనేజర్ల వరకు అందరికీ పోషకాహారంతో కూడిన సురక్షిత ఆహారాన్ని అందించ డమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

**అమలులో అలసత్వం వహిస్తే చర్యలు** : ఈ నిబంధనల అమలు బాధ్యతను హెచ్‌ఎంలు, పాఠశాల యాజమాన్యాలకే అప్పగించారు. నిబంధనల ఉల్లంఘనలను పసిగట్టేందుకు ఎఫ్‌డీఏ ఇన్‌స్పెక్టర్లు ఏడాదికి కనీసం రెండుసార్లు ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తారని, నిబంధనలు దాటితే కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు. అదే సమయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు జిల్లా, తాలూకా స్థాయిల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు.




## డిసెంబర్‌లో రానున్న 'ఇడుపు కాయితం'

అచ్చ తెలంగాణ మాండలికమైన ఇడుపు కాయితం అనే మాటను టైటిల్‌గా పెట్టి రూపొందిస్తున్న 'ఇడుపు కాయితం' చిత్రం ముహూర్తం రోజు నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇందులో జానపద గీతాలతో సుపరిచితురాలైన నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రియదర్శి హీరోగా తెలంగాణ నేపథ్య కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి, డిసెంబర్ తొలివారంలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), జోర్దార్ సుజాత, చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చ రవి, బిత్తిరి సత్తి, అజయ్ బేతిగంటి, మైమ్ మధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాణం: సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్, నిర్మాత: బన్నీ వాస్, దర్శకత్వం: వంశీ దొండపాటి.

## నాగచైతన్య కొత్త సినిమా?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది.

ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.



## ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.


మృణాల్ ఠాకూర్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BYMARURI PULLAREDDY, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH,
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR : Shaik Abdul gouse ali